


రాయితీ వైసీపీ వాళ్లకా?



- అస్తవ్యస్తంగా కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ల పని విధానం
- వైసీపీ నేతల చేతిలోనే యంత్ర పరికరాలు
- గ్రూపుల ఎంపికలో ఇష్టారాజ్యం
- క్షేత్రస్థాయిలో యూనిట్లపై కొత్త ప్రభుత్వం ఆరా

నంద్యాల ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం రాయితీ యంత్రాలను రైతులకు ఇస్తామని చెప్పి మూడేళ్లపాటు మాటలతో సరిపెట్టింది. ఆ తర్వాత రెండేళ్లు దీని మీద కాస్త హడావిడి చేసిందేగాని పనేమీ జరగలేదు. వెరసి రాయితీ యంత్రాల వ్యవహారం గాలిలోనే ఉంచింది. అంతకు ముందున్న టీడీపీ ప్రభుత్వం రైతులకు రాయితీ మీద పనిముట్లు ఇచ్చే విధానాన్ని కాదని కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లు ఏర్పాటు చేసింది. ఈ పేరుతో రైతులకు వ్యక్తిగతంగా సాగు పనిముట్లను ఇస్తానని ప్రకటించింది. కానీ ఆచరణలో రైతులకు దీని వల్ల ఎలాంటి ప్రయోజనం కలగలేదు. అర్హులైన రైతులను పక్కన పెట్టి తమ పార్టీ అనుచరులకే లబ్ధి కలిగేలా గ్రూపులను ఏర్పాటు చేసింది. వ్యవసాయంతో సంబంధం లేకుండా వేరే రంగాల్లో స్థిరపడిన వారికి కూడా వైసీపీ నేతల సిఫార్సుతో రాయితీ యంత్రాలు అందాయనే ఆరోపణలు అప్పట్లో వచ్చాయి. కొత్త ప్రభుత్వం ఈ రాయితీ యంత్రాల యూనిట్ల భాగోతాన్ని బైటికి తీసింది. ఎన్ని గ్రూపులకు పరికరాలు ఇచ్చారు? ఆ పరికరాలు నిబంధనల ప్రకారం రైతుసేవా కేంద్రాలలోనే ఉన్నాయా? లబ్ధిదారుల జాబితా ఏమిటి? అనే అంశాలు వెలికి తీసి పంపమని రాష్ట్ర వ్యవసాయశాఖ నుంచి జిల్లా అధికారులకు మౌఖిక ఆదేశాలు అందాయి.

2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం రైతులకు సాగు పనిముట్లను రాయితీపై వ్యక్తిగతంగా అందించేది. దీనికి సంబంధించిన విధివిధానాలపై పూర్తి స్థాయిలో స్పష్టత ఉండడంతో రైతులకు మేలు జరిగింది. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం తొలి మూడేళ్లు రాయితీ యంత్ర పరికరాలను అందించే పథకం గురించి పూర్తిగా పట్టించుకోలేదు. పరికరాలు అవసరమైన రైతుల నుంచి వ్యతిరేకత రావడంతో చివరి రెండేళ్లలో మాత్రం కమ్యూనిటీ హైరింగ్ సెంటర్(సీహెచ్‌సీ)ల పేరిట రైతులను గ్రూపులుగా ఏర్పాటు చేసింది. రాయితీ పరికరాలను రైతు సేవా కేంద్రాల్లో (అప్పట్లో రైతు భరోసా కేంద్రాలు) ఉంచి వాటిని నామమాత్రపు అద్దె ప్రాతిపదికన రైతులకు అందించాలని నిర్ణయించింది. ప్రకటన ఇవ్వడం తప్ప మార్గదర్శకాల విషయంలో వైసీపీ ప్రభుత్వం పలుమార్లు మల్లాగుల్లాలు పడింది. ముఖ్యమైన యంత్రాలను అందించే విషయంలో రైతులకు మొండి చేయి చూపింది. సేద్యంలో అత్యంత అవసరమైన ట్రాక్టరును రాయితీ నుంచి మినహాయించడంతో జిల్లా వ్యాప్తంగా రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. తర్వాత దిగి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రాయితీ యంత్రాలలో ట్రాక్టరును కూడా చేర్చింది. ఈ లబ్ధి అయినా రైతులకు చేకూరిందా? అంటే అదీ లేదు. రాయితీ యంత్రాలు అందించే కంపెనీలకు బిల్లులు పెండింగ్ పెట్టడంతో యంత్రాల సరఫరా సక్రమంగా జరగలేదు. ఇలా అనేక బాలారిష్టాలను దాటి రైతుల సేవా కేంద్రాలకు వచ్చిన అరకొర యూనిట్ల లబ్ధి కూడా అసలైన రైతులకు కాకుండా, వైసీపీ సానుభూతిపరులకే అందించారు. మొత్తానికి గత ప్రభుత్వంలో రాయితీ యంత్రాల పథకం రైతులకు అందకుండా పోయింది.

● వైసీపీ నేతల ఇళ్ల వద్దే..

రాయితీ యంత్రాల పరికరాల పథకం విషయంలో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పనిముట్లను రైతు సేవా కేంద్రాలలో ఉంచాలి. కానీ ఆచరణలో మాత్రం ఆ పరికరాలన్నీ కూడా వైసీపీ నేతల ఇళ్ల వద్దే ఉండేవి. హక్కుగా వాటి ప్రయోజనాలను పొందాల్సిన రైతులు అలా కాకుండా వైసీపీ నేతల ఇళ్ల ముందు పడిగాపులు కాచే విధంగా చేశారు. ఇక అద్దె విషయంలో కూడా ఇష్టారీతిన వ్యవహరించినా అడిగే వారే లేకుండా పోయారు. పూర్తి పక్షపాత ధోరణితో ఈ వ్యవహారం నడిచేది. వైసీపీతో అంటకాగితే ఒకలా, టీడీపీ సానుభూతిపరులుగా ముద్ర ఉన్న రైతుల విషయంలో అద్దె మరో విధంగా ఉండేది. టీడీపీ సానుభూతిపరులకు అద్దెను అమాంతం రెండు మూడు రెట్లు పెంచి నిలువునా దోచేశారు. దేనికీ లెక్కాపత్రం ఉండేది కాదు. పర్యవేక్షించే వ్యవస్థలు కూడా లేకపోవడంతో రాయితీ యంత్రాలను రాజకీయ యంత్రాలుగా మార్చి వైసీపీ నేతలు విపరీతంగా దోచేశారు.



సగం యూనిట్లు వారి చేతిలోనే..

జిల్లా వ్యాప్తంగా మొత్తం 411 రైతు సేవా కేంద్రాలు (రైతు భరోసా కేంద్రాలు) ఉండగా అప్పట్లో యంత్ర పరికరాలను అందించేందుకు 408 గ్రూపులను ఏర్పాటు చేసింది. నంబరు చూస్తే ఘనంగా కనిపిస్తున్నా.. వాస్తవ పరిస్థితులను చూస్తే మాత్రం అందుకు పూర్తి భిన్నంగా ఉండేది. ట్రాక్టర్లు, స్ప్రేయర్లు, కల్టివేటర్లు, రొటావేటర్ల వంటివి రాయితీ యంత్రాలు ఒకేసారి అందించకుండా, రైతులను సతాయిస్తూ దఫాల వారీగా ఇవ్వడం మొదలుపెట్టింది. ఇందులో చాలా చోట్ల ట్రాక్టరు లేకుండానే మమ అనిపించారు. అసలు ఈ విధానం గురించి ప్రభుత్వం స్పష్టత ఇవ్వకుండా రైతులను సతాయించింది. ఆయా గ్రూపుల ద్వారా రైతుసేవా కేంద్రాల నుంచి రాయితీ యంత్రాలు అద్దె ప్రాతిపదికన తీసుకుంటే.. వాటి అద్దె ఎంత? వాటిని పర్యవేక్షించేది ఎవరు? అనే అంశాలపై అంతా గందరగోళమే ఉండింది. దీంతో రాయితీ యంత్రాల పథకం ఉన్నా వాటి ఫలాలు అందకపోవటంతో అన్నదాతలు అగచాట్లు పడ్డారు. ఇక గ్రూపుల సంఖ్య ఎక్కువగానే కనిపించినా.. వీటిలో వాస్తవ రైతు గ్రూపులు ఎన్ని? అనేది ఆరా తీస్తే.. 50 శాతం వైసీపీకి కొమ్ముకాసిన వారే లబ్ధిదారులనే విషయం బైటపడింది. ఇలా రాయితీ యంత్రాల పథకం వైసీపీ హయాంలో పూర్తిగా నీరు గారి పోయింది.

● సమగ్ర విచారణ దిశగా..

రాయితీ యంత్రాల విషయంపై కొత్త ప్రభుత్వం సమగ్ర విచారణ చేయడానికి సిద్ధమైంది. జిల్లాల్లో జారీ చేసిన యూనిట్లలో సభ్యులుగా ఉన్నవారెవరు? అనే అంశంపై పూర్తి స్థాయిలో దృష్టి సారించింది. ఈ గ్రూపుల్లో ఉన్న వారు అసలు రైతులా? కాదా? అనే దానిపైనే తొలుత విచారణ జరగనుంది. పరికరాలను అందుకున్న సభ్యులు అద్దె ప్రతిపాదికన ఎంతమందికి ఇచ్చారు? ఎంత అద్దె వసూలు చేశారు? దీని ద్వారా ఎంతమేర లబ్ధి చేకూర్చింది? అనే విషయంపై కూడా విచారణ చేసి నివేదికను అందించే దిశగా అధికారులు కసరత్తు చేస్తున్నారు. సేవా కేంద్రాల్లో ఉంచకుండా యంత్ర పరికరాలను తమ ఇళ్ల వద్దే పెట్టుకున్న వైసీపీ నేతలు విచారణ జరుగుతుందన్న ఉద్దేశంతో తిరిగి వాటిని కేంద్రాల్లో పెట్టి వెళుతున్నట్లు తెలుస్తోంది.



● కొన్ని యంత్రాలు అసలు లేవా?

ఒక్కో గ్రూపునకు రూ. 5 నుంచి రూ. 15 లక్షల విలువైన యంత్ర పరికరాలను అందించారు. యంత్రాల కోసం గ్రూపులకు అందించే రుణాలలో 50 శాతం బ్యాంకు రుణం కాగా, 40 శాతం వాటాను ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చేది. మిగిలినది గ్రూపు సభ్యులే భరించాలి. ఈ పద్ధతిలో గ్రామంలోని రైతుల అవసరాల కోసం అద్దె ప్రాతిపదికన యంత్రాలు ఇవ్వాలి. కానీ క్షేత్రస్థాయిలో పరిశీలనకు వెళ్లిన అధికారులకు విస్తుపోయే అంశాలు బైటపడ్డాయి. అసలు గ్రామాల్లో గ్రూపు సభ్యుల జాడ కనిపించడంలేదు. మొక్కుబడిగా కొన్ని పేర్లు చేర్చి ఆ సబ్సిడీని వైసీపీ నేతలే కొట్టేశారా? అనే అనుమానం కూడా కలుగుతోంది. పరికరాలు కూడా అన్నీ కనిపించడం లేదని, దాదాపు ప్రతి గ్రూపులో ఒకట్రెండు యంత్రాలు మాయమయ్యాయని అంటున్నారు. ఈ యంత్రాలు ఏమయ్యాయి? అసలు ఉన్నాయా? లేక గ్రూపు సభ్యులు అమ్ముకున్నారా? అనే కోణంలో అధికారులు విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది.

నేర నివారణే లక్ష్యంగా విజిబుల్ పోలీసింగ్



డంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

నంద్యాల క్రైం, ఆగస్టు 7 : నంద్యాల ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు నేర నివారణే లక్ష్యంగా విజిబుల్ పోలీసింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన విజిబుల్ పోలీసింగ్ దాడుల్లో మట్కా, జూదం, అక్రమ మద్యం, ఇసుక, డంకెన్ డ్రైవ్, రోడ్డు ప్రమాదాల నివారణకు మోటార్ వెహికల్ యాక్ట్‌ను కట్టుదిట్టంగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగా డంకెన్ డ్రైవ్‌లో మొత్తం 7కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడుల్లో భాగంగా 96 ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేశామన్నారు. మోటార్ వెహికల్ చట్టం అమలు చేస్తూ 185 కేసులు నమోదు చేసి రూ.78,135 జరిమానా విధించామన్నారు. డోన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మున్సిపల్ కార్యాలయం వెనుక పేకాట ఆడుతున్న సమాచారం మేరకు ఎస్సై శరత్‌కుమార్ తన సిబ్బందితో కలిసి దాడిచేసి 9మందిని అదుపులోకి తీసుకొని వారివద్ద నుంచి రూ.11,400 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా అడిషనల్ ఎస్పీ పర్యవేక్షణలో సెబ్, సివిల్ పోలీసుల ఆధ్వర్యంలో నాటు సారా అమ్మేవారిపై దాడులు చేసి 5కేసులు నమోదు చేసి 150 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

చెంచులకు జనన ధ్రువీకరణ పత్రాలు



చెంచులకు జనన ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న డాక్టర్ రాజశేఖర్

పాణ్యం, ఆగస్టు7: స్థానిక ఇందిరానగర్‌కు చెందిన 9 మంది చెంచులకు బుధవారం జనన ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. నంద్యాల ప్రభుత్వ వైద్యశాలలో ఫోరెన్సిక్ వైద్యుడు డాక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో 26 మందికి గాను ప్రస్తుతం 9 మందికి ధ్రువీకరణ పత్రాలు అందించామన్నారు. మిగిలిన వారికి త్వరలో అందిస్తామన్నారు. చెంచు వికలాంగులకు ఆధార్ కార్డులు లేకపోవడంతో సదరన్ క్యాంపుకు అనర్హులు కావడంతో జనన ధ్రువీకరణ పత్రాల కోసం పరీక్షలు నిర్వహిస్తున్నట్లు టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకులు ఖాదర్‌బాషా తెలిపారు.

చెన్నైకి ఇంద్ర ఏసీ సర్వీసు



కర్నూలు(రూరల్)ఆగస్టు 7: కర్నూలు-2డిపో నుంచి వారాంతంలో చెన్నైకు ఇంద్ర ఏసీ సర్వీసును ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ సర్దార్‌హుస్సేన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సర్వీసు నంద్యాల ఆళ్లగడ్డ, మైదుకూరు, కడప, తిరుపతి మీదుగా వెళ్లనున్నట్లు ఆయన వివరించారు.

జిల్లా అభివృద్ధికి చర్యలు తీసుకోండి
- కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల (కల్చరల్), ఆగస్టు 7: 'ప్రజల కోసం పనిచేస్తున్నాం. ప్రజలు కట్టే పన్నులతో జీతాలు తీసుకుంటున్నాం. ప్రతి జిల్లా అధికారి బాధ్యతాయుతంగా పనిచేసి జిల్లా అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి' అని కలెక్టర్ రాజకుమారి పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో వైద్యఆరోగ్యం, సంక్షేమం, ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్, రెవెన్యూ, ఉపాధిహామీ, టూరిజం తదితర శాఖలపై అధికారులపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. వారంలో మూడు,నాలుగు రోజులు క్షేత్రస్థాయిలో పర్యటించి జిల్లా అభివృద్ధికి అవసరమయ్యే చర్యలను వేగవంతంగా తీసుకోవాలన్నారు. జిల్లాలో మూతపడిన 160 పరిశ్రమల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలన్నారు. నంద్యాల, డోన్, ఆళ్లగడ్డ పట్టణాల్లో ఇండస్ట్రియల్ పార్క్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. పీఎం సూర్యఘర్ యోజన కింద రాయితీపై సోలార్ రూఫ్ టాప్ నిర్మాణానికి ప్రజల్లో చైతన్య తీసుకురావాలని ఎనర్జీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్, డీఆర్వో పద్మజ పాల్గొన్నారు.

టీడీపీలోకి 12 మంది వైసీపీ కౌన్సిలర్లు
టీడీపీ కైవసం కానున్న నందికొట్కూరు మున్సిపాలిటీ



అల్లూరు గ్రామంలో మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే జయసూర్య సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ కౌన్సిలర్లు

నందికొట్కూరు రూరల్, ఆగస్టు 7: నందికొట్కూరు మున్సిపల్ పట్టణంలో మొత్తం 29 మంది వార్డు కౌన్సిలర్లు వుండగా అందులో వైసీపీ కౌన్సిలర్లు 12 మంది టీడీపీ నాయకులు మాండ్ర మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ కండువా కప్పుకున్నారు. దీనితో నందికొట్కూరు మున్సిపాలిటీ వైసీపీ నుండి టీడీపీ కైవసం కాబోతోందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. బుధవారం నందికొట్కూరు మండలం అల్లూరు గ్రామంలోని మాండ్ర నివాసంలో వారు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నంద్యాల జిల్లా టీడీపీ నాయకుడు మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్యల ఆధ్వర్యంలో నందికొట్కూరు మున్సిపల్ పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకే టీడీపీలో చేరుతున్నామని తెలిపారు. తెలుగు దేశం పార్టీ కండువా కప్పుకున్న నందికొట్కూరు మున్సిపల్ వైసీపీ కౌన్సిలర్లు 1 వవార్డు కౌన్సిలర్ చిన రాజు, 2వార్డు జయమ్మ, 5 వార్డు రేష్మ, 6 వార్డు దేశెట్టి సుమలత, 8 వార్డు కరిస్మా, 11 కొండ్రెడ్డి విజయమ్మ, 13 వార్డు శాంతి ఆలియాస్ మాధవి, 14 వార్డు అశోక్, 15 వార్డు క్రిష్ణవేణి, 18 వ వార్డు ధర్మారెడ్డి, 19 వవార్డు గుఱ్రాల లక్ష్మీదేవి, 20 వవార్డు మండడి వాణి టీడీపీలో చేరారు. 28 వార్డు టీడీపీ కౌన్సిలర్ భాస్కర్‌రెడ్డి, 2 వార్డు జాకీర్ హుస్సేన్, 25 వ వార్డు రబ్బాని ముగ్గురు అంతకు ముందే టీడీపీలో వున్నారు. వీరితో కలిపి మాండ్ర వర్గంలో 15 మంది మున్సిపల్ కౌన్సిలర్ల్ చేరినట్లయ్యింది. కోఆప్షన్ సభ్యులు కూడా శివానందరెడ్డి వెంటే వున్నారని అంటున్నారు. దీనితో నందికొట్కూరు మున్సిపాలిటీ టీడీపీ కైవసం కాబోతోందనే చర్చలు జోరందుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి అంటే నారా చంద్రబాబు నాయుడు అని దేశమంతా తెలుసు అన్నారు. తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణకు మారు పేరని అన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా వున్న సమయంలోనే నందికొట్కూరు నియోజక వర్గంలో దాదాపుగా 8 ఎత్తిపోతల పథకాలను యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేసి నీరు ఇచ్చిన ఘనత మాండ్ర శివానందరెడ్డిదే అన్నారు. అనంతరం మాండ్ర శివానందరెడ్డి మాట్లాడుతూ రాజకీయాలను పక్కన పెట్టి నందికొట్కూరు పట్టణంలో ట్రాఫిక్ సమస్య నుండి బయట పడడానికి డివైడర్‌ను ఏర్పాటు చేయాలని అన్నారు. అలాగే పట్టణానికి తాగునీటి సమస్య పరిష్కరించాలని, మున్సిపల్ కార్యాలయ భవనం నిర్మాణం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మున్సిపల్ వైస్ ఛైర్మన్ రబ్బాని, కౌన్సిలర్ జాకీర్, కౌన్సిలర్ భాస్కర్‌రెడ్డి, మాండ్ర సురేంద్ర నాథరెడ్డి, ప్రసాదరెడ్డి, తమడపల్లె విక్టర్, మాజీ ఎస్సై జాన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీశైలానికి కొనసాగుతున్న వరద

శ్రీశైలం, ఆగస్టు 7: ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైల జలాశయానికి వరద ప్రవాహం బుధవారం కొనసాగింది. జూరాల, సుంకేసుల నుంచి వరద ప్రవాహం కొనసాగడం తో డ్యామ్ అధికారులు జలాశయం పది క్రస్టుగేట్లను 12 అడుగుల మేర ఎత్తి నీటిని దిగువ నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. జూరా ల నుంచి 2,87,574 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 44,790 క్యూసెక్కులు మొత్తం 3,32,364 వరద ప్రవాహం వస్తోంది. బుధవారం సాయం త్రం ఆరు గంటల సమయానికి 2,81,344 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం జలాశయానికి చేరుతోంది. శ్రీశైలం జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 882.80 అడుగులుగా నమోదయింది. జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 203.4290 టీఎంసీలుగా నమోదయింది. ఆంధ్రప్రదేశ్ జల విద్యుత్ కేంద్రం ద్వారా 26,911 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 37,857 క్యూసెక్కుల, డ్యామ్ క్రస్టుగేట్ల ద్వారా 3,09,890 క్యూసెక్కులు మొత్తం 3,74,658 క్యూసెక్కుల నీటిని దిగువ నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.



జీవితాలకు నవోదయం



ల్యాబ్‌లో ప్రయోగాలు చేస్తున్న విద్యార్థులు

● మనసు పెట్టి చదివితే సీటు సొంతం ● ప్రవేశ పరీక్షకు నోటిఫికేషన్ విడుదల



నవోదయ విద్యాలయం ప్రధాన కార్యాలయం

ఎమ్మిగనూరు, ఆగస్టు 7: నవోదయలో చదివితే విద్యార్థి జీవితానికి మంచి పునాదులు పడతాయి. విద్యారంగంలో నవోదయ విద్యాలయాన్ని మించింది లేదనే గుర్తింపు ఉంది. ఐఏఎస్, ఐపీఎస్‌లు మొదలు ఉన్నతాధికారులుగా స్థిరపడిన చాలా మంది నవోదయలో చదువుకున్నవారే. కాస్త కష్టపడి చదివితే సీటు సంపాదించడం పద్ద కష్టం కాదని అంటా రు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలంలో 1987లో బనవాసి ఫారం దగ్గర నవోదయ విద్యాలయాన్ని ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో 32 ఎకరాల విస్తీర్ణంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి ఈ విద్యాలయంలో వేల మంది చదువుకున్నారు. ఇక్కడ చదువుకున్నవారిలో నలుగురు ఐఏఎస్, ఇద్దరు ఐపీఎస్‌లు ఉన్నారు. వంద మంది డాక్టర్లు, వెయ్యిమందికి పైగా ఇంజనీర్లు, ఎస్సైలు, డీఎస్పీలు, టీచర్లు వేల సంఖ్యలో ఉండడం విశేషం. నవోదయలో తమ పిల్లల్ని చదివించాలని తల్లిదండ్రులు కోరుకుంటారు. అక్కడ చదివితే తప్పక మంచి భవిష్యత్ ఉంటుందని నమ్మకం. నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో 80 సీట్లు ఉంటాయి. ప్రవేశ పరీక్ష తప్పనిసరి.

● **రిజర్వేషన్లు:** విద్యాలయంలోని 80 సీట్లలో గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు 75శాతం, పట్టణ ప్రాంత విద్యార్థులకు 25శాతం కేటాయించారు. ఇందులో బాలికలకు 33శాతం, ఎస్సీలకు 15, ఎస్టీలకు 7.5, వికలాంగులకు 3శాతం, మిగిలినవి జనరల్ కింద రిజర్వేషన్లు ఉంటాయి.

● **జనవరి 18న ప్రవేశ పరీక్ష:** దేశ వ్యాప్తంగా ప్రవేశ పరీక్ష 18.1.2025వ తేదీన ఉంటుంది. ఈ పరీక్షా పత్రం విద్యార్థులకు సౌలభ్యంగా ఉండేందుకు అన్ని భాషల్లో ప్రశ్నా పత్రాలు ఉంటాయి. ఓఎమ్మార్ సీటు లో జవాబులు రాయాల్సి ఉంటుంది. ఇందుకుగాను విద్యార్థులు తప్పని సరిగా బ్లాక్ లేదా బ్లూ బాల్‌పెన్‌లను మాత్రమే ఉపయోగించాలి. కొట్టి వేతలు ఉంటే దాన్ని పరిగణలోకి తీసుకోరు.

● **ఎంపిక పరీక్షా విధానం:** ప్రశ్నా పత్రం వంద మార్కులకు ఉంటుం ది. ఇందులో విభాగం-1లో మేధాశక్తి- 50 మార్కులు, విభాగం-2లో గణితం -25, విభాగం-3లో భాషాపరిజ్ఞానానికి - 25మార్కులు ఉంటాయి. రెండు గంటల వ్యవధిలో వంద మార్కుల ఆబ్జెక్టివ్ పరీక్ష ఉంటుంది. అభ్యర్థి పరీక్ష రాసే భాషను సమాచార సంచికలో సూచించిన 21 భాషలలో ఏదైనా ఒక భాషను ఎంచుకోవాలి.

● **ఒకేసారి అవకాశం:** నవోదయ విద్యాలయంలో చేరేందుకు ప్రవేశపరీక్షకు ఒకసారి మాత్రమే అవకాశం ఉంటుంది. రెండోసారి ప్రవేశ పరీక్షరాసినా ఎంపిక సమయంలో ఆ విద్యార్థి దరఖాస్తును తొలగిస్తారు.

● **ప్రవేశ పరీక్షకు నోటిఫికేషన్ విడుదల:** దేశంలోని 28 రాష్ట్రాల్లో, ఏడు కేంద్రపాలిత ప్రాంతాల్లో 625 విద్యాలయాలు ఉన్నాయి. 2024-25 విద్యా సంవత్సరానికి గాను జవహర్ నవోదయ విద్యాలయంలో 6వతరగతి ప్రవేశ పరీక్షకు నోటిఫికేషన్ కేంద్ర ప్రభుత్వం జారీ చేసింది. పూర్తి చేసిన దరఖాస్తులను 16.9.24వ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి ప్రవేశ పరీక్ష జనవరి 18 2025న ఉంటుంది.

● **అర్హతలు :** ప్రస్తుతం ఉమ్మడి కర్నూలు జిల్లాలో 5వ తరగతి చదువుతున్న బాలబాలికలు 1.5.2013 నుండి 31.7.2015 మధ్య జన్మించి ఉండాలి. ప్రభుత్వ గుర్తింపు పొందిన ఏదైనా పాఠశాలలో 3,4 తరగతుల్లో ఉత్తీర్ణులై ప్రస్తుతం 5వ తరగతి చదువున్న వారు అర్హులు.

● **సౌకర్యాలు:** బాల బాలికలకు ప్రత్యేక హాస్టల్ సౌకర్యం, అర్హత, అనుభవం కలిగిన బోధనా సిబ్బంది, విద్యలో సాంకేతిక, శాస్త్ర సమాచారం తగిన సహపాఠ్య కార్యక్రమాలను, క్రీడలను, ఆటలు, యోగా పొందుపరచడం, సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం, యూనిఫారం, పాఠ్యపుస్తకాలు, స్టేషనరి, భోజన వసతి మొదలగునవి ఉచితంగా ఇస్తారు. ఐఐటీ, నీట్, ఎన్ఐటీ, ఏఐఈఈకి ప్రత్యేక శిక్షణ, 1:40 నిష్పత్తిలో విద్యాబోధన, కంప్యూటర్ విద్య కోసం రెండు ల్యాబ్‌లు ఉన్నాయి. బయాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్ అంశాల్లో ప్రయోగాలకు ల్యాబ్‌లు ఉంటాయి.

● **దరఖాస్తు చేసుకొనే విధానం :** విద్యార్థులు పూర్తిగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. హెచ్‌టీటీపీఎస్//సీబీఎస్ఈఐటీఎంఎస్.ఆర్‌సీఐఎల్.జీఓవీ.ఇన్/ఎన్‌వీఎస్ కు నిర్దేశిత పత్రాలను జతచేసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

● **అవంతి లెర్నింగ్ ఇన్‌స్టిట్యూట్:** నవోదయ విద్యాలయంలో ఈ ఏడాది అవంతి లెర్నింగ్ ఇన్‌స్టిట్యూట్ మంజూరయ్యింది. దీన్ని ఈనెల 22 న ప్రిన్సిపాల్ పద్మావతి ప్రారంభించారు. రాష్ట్రంలోని 11 జవహర్ నవోదయ విద్యాలయాల నుంచి 40మంది విద్యార్థులు అవంతికి ఎంపికయ్యారు.



తరగతి గదుల్లో విద్యార్థులు



లైబ్రరీలో విద్యార్థులు

రోజూ ఐదు గంటలు చదివా



మా గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు వెళుతూనే రోజు సాయంత్రం 5 గంలనుంచి 10గంల వరకు ప్రవేశ పరీక్ష కోసం మా అమ్మా నాన్న చదివించేవారు. ఇలా నాలుగు నెలల పాటు చదవడం వల్లే నాకు సీటు వచ్చింది.

- సుహానీ ప్రియ, 6వ తరగతి, అనుగొండ కోడుమూరు మండలం, కర్నూలు జిల్లా

ప్రత్యేక శిక్షణతో సీటు సాధించా



మాది బనగానపల్లె. మా ఊరిలో ఉన్న ప్రయదర్శిని పాఠశాలలో చదివే సమయంలో ఉపాధ్యాయులు నవోదయ విద్యాలయంలో ప్రవేశ పరీక్షకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు చదివి సీటు సాధించా.

- కే.సుచంద్ర, 6వ తరగతి, బనగానపల్లె, నంద్యాల జిల్లా

ప్రణాళిక ప్రకారం చదివితే..



విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా, క్రమశిక్షణతో రెండు మూడు నెలలు కష్టపడి చదివితే సులువుగా ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత కావచ్చు. నవోదయ విద్యాలయంలో విద్యార్థులకు ఒత్తిడి లేని విద్యను అందిస్తున్నాం.

- ఈ పద్మావతి, ప్రిన్సిపాల్, జవహర్ నవోదయ విద్యాలయం, బనవాసి, ఎమ్మిగనూరు మండలం

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

● కలెక్టరేట్ ఎదుట విద్యార్థి సంఘాల ఆందోళన, నాయకుల అరెస్టు

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 7: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యు) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అఖండ, మహేంద్రబాబు డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట విద్యార్థులు ఆందోళన చేశారు. ఈ కార్యక్రమం ఉద్రిక్తంగా మారడంతో విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విద్యార్థి సంఘాల నాయకులు కలెక్టరేట్ కార్యాలయం గేట్లు ఎక్కి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు విలయతాండవం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. గత ప్రభుత్వం 3, 4, 5 తరగతుల విలీన ప్రక్రియ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 4,500 ప్రాథమిక పాఠశాలలు మూసివేసిందని అన్నారు. 84, 85, 117 జీవోలను తక్షణమే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, నాయకులు నరేష్, రసూల్, రామకృష్ణ, ప్రశాంత్, వీరేష్, కిరణ్, మహేష్ పాల్గొన్నారు.

ముగ్గురు సీఐలకు అటాచ్‌మెంట్

కర్నూలు, ఆగస్టు 7: నంద్యాల జిల్లాలో ముగ్గురు సీఐలకు అటాచ్‌మెంట్లు ఇచ్చారు. డోన్ రూరల్ సర్కిల్‌లో ఉన్న అస్రార్ బాషాకు ప్యాపిలి సర్కిల్, నంద్యాల ఫ్యాక్షన్ జోన్‌లో ఉన్న వంశీధర్‌కు పాణ్యం సర్కిల్, ఆత్మకూరు యూపీఎస్‌లో ఉన్న లక్ష్మీనారాయణకు ఆత్మకూరు రూరల్ సర్కిల్‌లను తాత్కాలికంగా అటాచ్‌మెంట్ చేస్తూ పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మరో రెండు రోజుల్లో ఆయా సర్కిళ్ల పరిధిలో కొత్త సీఐలకు పోస్టింగులు ఇవ్వనున్నారు.

ఘర్షణలో గాయపడిన వ్యక్తి మృతి

డోన్(రూరల్), ఆగస్టు 7: మండలంలోని వెంకటనాయునిపల్లె గ్రామంలో పొలంగట్టు వివాదంలో జరిగిన ఘర్షణలో గాయపడిన మాధవయ్య (55) బుధవారం కోలుకోలేక మృతి చెందాడు. నెల రోజుల క్రితం జరిగిన ఈ ఘర్షణలో చికిత్స పొంది తిరిగి ఇంటికి చేరుకున్న మాధవయ్య మరలా అస్వస్థతకు గురయ్యాడు. డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేలోపు మృతి చెందినట్లు డోన్ పట్టణ ఏఎస్ఐ భాస్కర్ తెలిపారు. మృతుని కుటుంబానికి వెంకటనాయునిపల్లె గ్రామ సర్పంచ్ సీలం చంద్రశేఖర్ నాయుడు పరామర్శించారు.

హత్యకేసులో నిందితుల అరెస్టు

నంద్యాల క్రైం, ఆగస్టు 7 : సీతారామాపురం హత్యకేసులో నిందితులను అరెస్టు చేసినట్లు నంద్యాల ట్రాఫిక్, నంద్యాల తాలుకా ఇన్‌చార్జి సీఐ షేక్ ఇస్మాయిల్ తెలిపారు. నంద్యాల ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు, నంద్యాల డీఎస్పీ ఎన్. రవీంద్రనాథ్‌రెడ్డి పర్యవేక్షణలో తాను, బండిఆత్మకూరు ఎస్సై మల్లికార్జున, సీసీ నాగార్జునరెడ్డి, గోస్పాడు ఎస్సై తదితరులతో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఈ నెల 3వ తేదీ అర్ధరాత్రి 12.20గంటల సమయంలో సీతారామాపురం గ్రామానికి చెందిన పసుపులేటి సుబ్బరాయుడు (68) అనే వృద్ధుడిని కత్తులు, రాళ్లు, కట్టెలు, ఇనుపరాడ్లతో దాడిచేసి హత్యచేసిన కేసులో అదే గ్రామానికి చెందిన బుడ్డారెడ్డి శ్రీనివాసరెడ్డి వర్గానికి చెందిన 11మంది నిందితులను బుధవారం ఉదయం 9.45గంటలకు నంద్యాల-చాపిరేవుల రోడ్డులో చాపిరేవుల అండర్‌పాస్ దగ్గర అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితుల నుంచి మూడు కత్తులు, మూడు కట్టెలు, రెండు సెల్‌ఫోన్లను, స్కోడా కంపెనీకి చెందిన ఏపీ 21 ఏఎం 3333 కారును, ఫార్చునర్ కంపెనీకి చెందిన ఏపీ 40 4251గల కారును సీజ్ చేశామన్నారు. నిందితులు బుడ్డారెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వంగాల లక్ష్మిరెడ్డి, వంగాల పుల్లారెడ్డి, బుడ్డారెడ్డిగారి లక్ష్మినాగశేఖర్‌రెడ్డి అలియాస్ కుంటి శేఖర్‌రెడ్డి, తాలూరి శ్రీనివాసులు అలియాస్ దుబ్బ శ్రీను, పెరుమాళ్ల వెంకటరమణ అలియాస్ డీలర్ రమణ, మైలాపురం రామచంద్రారెడ్డి, దూదేకుల బాల హుసేని, జిల్లెల్ల భాస్కర్, గని రంగస్వామి, వంగాల ఈశ్వర్‌రెడ్డిలుగా డీఎస్పీ పేర్కొన్నారు. హత్యకేసులో మిగతా నిందితులను అదుపులోకి తీసుకోవడానికి ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయని డీఎస్పీ వెల్లడించారు.

గిరిజన యువకుడి ఆత్మహత్య

కొత్తపల్లి, ఆగస్టు 7: మండలంలోని ఎర్రమఠం గిరిజన గూడానికి చెందిన కుడుముల లింగన్న (20) అనే గిరిజన యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎర్రమఠం గూడెంకు చెందిన కుడుముల తిక్కోడు కుమారుడు లింగన్నకు గత రెండేళ్ల క్రితం అదే గూడేనికి చెందిన లింగమ్మ అనే యువతితో వివాహమైంది. పెళ్లయినప్పటి నుంచి లింగన్న తరచూ మద్యం సేవిస్తూ భార్యతో గొడవ పడుతుండేవాడు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా కోలుకోలేక మృతి చెందాడు. మృతుని తండ్రి కుడుముల తిక్కోడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు.

గడియారం ఆసుపత్రి వద్ద వ్యక్తి హత్య

కర్నూలు, ఆగస్టు 7: వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గడియారం ఆసుపత్రి సమీపంలో కురువ శివ (40) అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. ఈ-తాండ్రపాడుకు చెందిన ఈయన కొద్ది కాలం కింద భార్యను వదిలేశాడు. గడియారం ఆసుపత్రి వద్ద వర్మ కాంపౌండులో ఐదేళ్ల నుంచి వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. ఈ కాంపౌండులో ఉన్న స్థలంలో బిల్డింగ్ కట్టే ప్రయత్నంలో కొట్టం వేసి శివను అక్కడ వాచ్‌మెన్‌గా నియమించారు. గుర్తు తెలియని వ్యక్తులు శివను క్రికెట్ బ్యాట్‌తో తలపై మోదీ హత్య చేసినట్లుగా పోలీసులు గుర్తించారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో సంఘటనా స్థలానికి వెళ్లి పోలీసులు శివ మృతదేహాన్ని పరిశీలించారు. ఓ మహిళతో వివాహేతర సంబంధంతోనే ఈ హత్య జరిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్, సీఐ పవన్ కుమార్‌లు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమితం కర్నూలు జీజీహెచ్‌కు తరలించారు.

ట్రాక్టర్ బోల్తా : ఒకరి మృతి

ఓర్వకల్లు, ఆగస్టు 7: మండలంలోని గుమితం తండాలోని పొలంలో బుధవారం సేద్యం పనులు చేస్తుండగా. ట్రాక్టర్ తిరబడి గోపినాయక్ (37) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు.

బ్యాంకాక్ నుంచి క్షేమంగా వచ్చిన మధుకుమార్

● సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లిన డోన్ ఎమ్మెల్యే కోట్ల ● కిడ్నాప్ కథ సుఖాంతం..



డోన్‌లో కోట్ల సూర్యప్రకాష్ రెడ్డితో ఉన్న మధుకుమార్, కుటుంబ సభ్యులు

డోన్, ఆగస్టు 7: బ్యాంకాక్‌లోని థాయ్‌లాండ్‌లో డోన్‌కు చెందిన మధుకుమార్ కిడ్నాప్ కథ సుఖాంతమైంది. డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి చొరవతో ఎట్టకేలకు మధుకుమార్ బ్యాంకాక్ నుంచి క్షేమంగా తిరిగి ఇంటికి చేరుకున్నాడు. డోన్ మండలంలోని చిన్నమల్కాపురం గ్రామానికి చెందిన సుంకన్న, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు మధుకుమార్ బీటెక్ పూర్తి చేశాడు. బెంగుళూరులో ఉద్యోగం కోసం ప్రయత్నిస్తుండగా.. ఒక ఏజెన్సీ ద్వారా బ్యాంకాక్‌లో ఉద్యోగం కోసం గత నెల 22వ తేదీన బెంగుళూరు నుంచి వెళ్లాడు. అయితే.. ఏజెన్సీ సభ్యులు చెప్పినట్లుగా మధుకుమార్‌కు ఉద్యోగం లేదని తేలిపోయింది. కొందరు ముఠాగా ఏర్పడి మధుకుమార్‌ను కిడ్నాప్ చేసి థాయ్‌లాండ్‌కు తీసుకెళ్లారు. డబ్బులు ఇస్తేనే విడుదల చేస్తామని బెదిరించారు. మొదట రూ.20 లక్షలు డిమాండ్ చేసిన కిడ్నాపర్లు చివరకు రూ.8 లక్షలు ఇస్తేనే వదిలిపెడతామని వేదింపులకు గురి చేసినట్లు బాధితుడు మధుకుమార్ తెలిపారు. లేదంటే చంపేస్తామని హెచ్చరించారు. దీంతో కిడ్నాప్‌కు గురైన మధుకుమార్ వ్యవహారాన్ని బాధితుడి తల్లిదండ్రులు డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ఇటీవల శ్రీశైలం పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబు దృష్టికి మధుకుమార్ కిడ్నాప్ వ్యవహారాన్ని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి తీసుకెళ్లారు. స్పందించిన సీఎం చంద్రబాబు కర్నూలు రేంజ్ డీఐజీతో పాటు కలెక్టర్, ఎస్పీలతో మాట్లాడారు. మధుకుమార్‌ను ఇండియాకు తీసుకుచ్చే బాధ్యతను వారికి అప్పగించారు. ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఎప్పటికప్పుడు జిల్లా పోలీసు ఉన్నతాధికారులతో, కలెక్టర్, ఎస్పీలతో మాట్లాడుతూ వచ్చారు.

● **పొదుపు మహిళలతో అప్పులు తీసుకుని కిడ్నాపర్లకు రూ.8 లక్షలు ఖాతాలోకి:**

థాయ్‌లాండ్‌లో కిడ్నాపర్ల చెరలో ఉన్న మధుకుమార్‌కు బెదిరింపులు తీవ్రమయ్యాయి. దీంతో తల్లిదండ్రులు పొదుపు మహిళలతో మాట్లాడి, ఒక్కో గ్రూపు నుంచి రూ.లక్ష చొప్పున 8 గ్రూపుల నుంచి రూ.8 లక్షలు అప్పు తీసుకున్నారు. ఆ మొత్తాన్ని కిడ్నాపర్లు పంపిన మూడు బ్యాంక్ ఖాతాల్లోకి జమ చేశారు. రూ.8 లక్షలు ముట్టిన తర్వాత మధుకుమార్‌ను విడిచిపెట్టారు. దీంతో విమానంలో బెంగుళూరు వచ్చి బుధవారం ఉదయం డోన్‌కు చేరుకున్నాడు. డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని కలిసి మధుకుమార్‌తో పాటు అతని తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

● **ఏజెన్సీలను నమ్మి మోసపోవద్దు: కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, ఎమ్మెల్యే, డోన్:**

విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని ప్రైవేటు ఏజెన్సీలు చెప్పే మాటలను నమ్మి మోసపోవద్దని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని తన నివాసంలో మధుకుమార్‌తో పాటు తల్లిదండ్రులతో ఎమ్మెల్యే కోట్ల మాట్లాడి భరోసా ఇచ్చారు. అన్ని రకాలుగా అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.

విద్యార్థి ఆత్మహత్యపై విచారణ



హస్టల్ వద్ద పరిశీలిస్తున్న ఆర్డీవో

కోడుమూరు (రూరల్), ఆగస్టు 7: మండలంలోని అమడగుంట్ల బీసీ హాస్టల్‌లో విద్యార్థి వీరేష్‌ఆచారి (13) భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో ఆర్డీవో శేషిరెడ్డి, డీఈవో శామ్యూల్ వేర్వేరుగా విచారణ జరిపారు. ముందుగా ఆర్డీవో శేషిరెడ్డి పాఠశాలలో విచారణ జరిపారు. హెచ్ఎంను అడిగి విద్యార్థి అడ్మిషన్ వివరాలపై తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయుల ప్రమేయం లేకుండా 7, 8వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. హాస్టల్‌లో సౌకర్యాలు, మెనూపై ఆరా తీశారు. ఆపై హాస్టల్ వద్దకు చేరుకుని ప్రమాదం జరిగిన తీరును వార్డన్ ప్రసన్నకుమార్ నుంచి వివరాలు రాబట్టారు. అనంతరం ఆర్డీవో కోడుమూరు చేరుకుని ప్రభుత్వాసుపత్రిలో విద్యార్థి మృతదేహాన్ని పరిశీలించి తల్లిదండ్రులను పరామర్శించారు. తాము పేదరికం అనుభవిస్తున్నా పిల్లలను చదివించుకోవాలని కలలు కన్నామని, తమ ఆశలు ఆవిరయ్యాయని విద్యార్థి తల్లిదండ్రులు బ్రహ్మయ్యఆచారి, రాధమ్మ రోదించారు. ప్రభుత్వం సాయం చేయాలని కోరారు. డీఈవో శామ్యూల్ కూడా విద్యార్థి ఆత్మహత్య ఘటనపై పాఠశాల, హాస్టల్ వద్ద విచారణ జరిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేష్‌నాయక్, ఎంఈవోలు వసంతలక్ష్మి, శరభయ్య హెచ్ఎం అనంతయ్యయాదవ్ పాల్గొన్నారు.

20 ఇళ్లకు షార్ట్ సర్క్యూట్

● కాలిపోయిన టీవీలు, ఫ్యాన్లు

● విద్యుత్ సబ్ స్టేషన్ ముందు కాలనీవాసుల ధర్నా

మద్దికెర, ఆగస్టు 7: స్థానిక గిడ్డయ్యవీధిలో హైవోల్టేజీ వల్ల 20 ఇళ్లకు షార్ట్ సర్క్యూట్ వచ్చి పది టీవీలు పూర్తిగా కాలిపోయాయి. పది ఫ్యాన్లు, పది బల్బులు, లైట్లు, గృహ పరికరాలు కూడా కాలిపోయాయి. దీంతో ఆగ్రహించిన కాలనీవాసులు విద్యుత్ సబ్ స్టేషన్ ముందు ధర్నా చేశారు. బుధవారం స్థానిక గిడ్డయ్య వీదిలో ఉదయం విద్యుత్ హైవోల్టేజీ వల్ల ఇళ్లకు షార్ట్ సర్క్యూట్ రావడంతో కాలనీలోని దేవేంద్ర, హుశేన్‌సాబ్, రాజు, నబీసాబ్, గోపాల్, శ్రీనివాసులు మరో 14 గృహాల్లోని ఫ్యాన్లు, టీవీలు కాలిపోయాయి. దీంతో కాలనీవాసులు పెద్ద ఎత్తున ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా విద్యుత్ హై వోల్టేజీ వస్తున్నదని విద్యుత్ అధికారులు చెప్పినప్పటికీ పట్టించుకోలేదని కాలనీవాసులు రామాంజులు, రుద్ర, వెంకటేశ్, గోపాల్ తదితరులు అన్నారు. అధికారులు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యుత్ ఏఈ మహ్మద్ ఖాన్‌కు వినతి పత్రం సమర్పించారు.



విద్యుత్ ఏఈ మహ్మద్ ఖాన్‌కు వినతి పత్రం ఇస్తున్న కాలనీవాసులు

బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరం

ముగిసిన తల్లిపాల వారోత్సవాలు



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మమ్మ

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 7: పుట్టిన బిడ్డలకు తల్లిపాలు ఇవ్వడం వల్ల వారిలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, బిడ్డకు తల్లి పాలు ఎంతో శ్రేయస్కరమని మెంబర్ ఆఫ్ స్టేట్ ఉమెన్ కమిషన్ రుఖియాబేగం అన్నారు. నగరంలోని బీ.క్యాంపు సీడీపీవో కార్యాలయంలో బుధవారం ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మమ్మ అధ్యక్షతన తల్లి పాల వారోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మెంబర్ ఆఫ్ స్టేట్ ఉమెన్ కమిషన్ హాజరై మాట్లాడారు. బిడ్డకు తొలి ఆహారం అమ్మ పాలే అని, ఇది బిడ్డ ఎదుగుదలకు పని చేస్తుందన్నారు. బిడ్డకు జన్మనిచ్చిన ప్రతి తల్లి మొదట ముర్రుపాలు తాగించినట్లయితే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మమ్మ తెలిపారు. ఎక్కువగా విటమిన్స్ ఉండే పదార్థాలు తీసుకోవడం వల్ల పుట్టబోయే బిడ్డ పరిపుష్టిగా ఉంటారన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా తల్లిపాల వారోత్సవాలు విజయవంతం గా నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రం సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు పక్కన శిశువు..!

శిరివెళ్లలో ఘటన

శిరివెళ్ల, ఆగస్టు 7: అప్పుడే పుట్టిన పసికందు.. కళ్లు తెరిచి లోకం చూస్తుండగానే తల్లి ఒడిని వీడి రోడ్డు పక్కకు చేరింది. ఈ ఘటన శిరివెళ్ల గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. శిరివెళ్లలోని పోలీస్‌స్టేషన్ మీదుగా గోవిందపల్లెకు వెళ్లే రహదారిలో రోడ్డు పక్కన ఓ ప్లాసిక్ కవర్‌లో చుట్టిపెట్టిన పసికందును గ్రామానికి చెందిన రఫీ, మరికొందరు గుర్తించారు. వెంటనే వారు ఆ శిశువును అక్కున చేర్చుకుని శిరివెళ్ల పోలీస్ స్టేషన్‌కు తీసుకుని వచ్చారు. ఎస్ఐ సురేష్ స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఐసీడీఎస్ ఆళ్లగడ్డ సీడీపీవో తేజశ్విని, శిరివెళ్ల సూపర్‌వైజర్ సువర్ణలతకు ఎస్ఐ సురేష్ శిశువును అప్పగించారు. శిశువు ఆరోగ్యంగా ఉందని, నిబంధనల మేరకు స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సంరక్షణ కల్పిస్తామని సీడీపీవో తేజశ్విని వెల్లడించారు.



నవజాత శిశువును ఐసీడీఎస్ అధికారులకు అప్పగిస్తున్న ఎస్ఐ సురేష్

కేసీ కాలువలో పడి వ్యక్తి మృతి

చాగలమర్రి, ఆగస్టు 7: చాగలమర్రి గ్రామానికి చెందిన రామచంద్రుడు (50) అనే వ్యక్తి బుధవారం కేసీ కాలువలో పడి మృతి చెందాడు. చాగలమర్రి గ్రామ సమీపంలోని కేసీ కాలువలో ప్రమాదవశాత్తు కాలువ నీటిలో పడ్డాడు. కడప జిల్లా కానగూడురు గ్రామ సమీపంలో కాలువలో కొట్టుకపోతుండగా కొందరు రైతులు గమనించి బయటకు తీశారు. ఈ విషయంపై దువ్వూరు పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన పోలీసు అధికారులు



అల్లూరులో ఎమ్మెల్యే జయసూర్య, మాండ్ర శివానందరెడ్డిని కలిసిన పోలీసు అధికారులు

నందికొట్కూరు రూరల్, ఆగస్టు 7: అల్లూరు గ్రామంలో మాండ్ర నివాసంలో టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్యను నూతనంగా బాధ్యతలు చేపట్టిన పోలీసు అధికారులు బుధవారం కలిశారు. ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్, నందికొట్కూరు రూరల్ సీఐ బీఆర్ కృష్ణయ్య, పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్‌రెడ్డి పుష్పగుచ్ఛాలు అందజేశారు. పోలీసు అధికారులు మాట్లాడుతూ నియోజకవర్గంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు, అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా చూస్తామన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజా వేదిక

నంద్యాల రూరల్, ఆగస్టు 7: నంద్యాల మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం, పంచాయతీరాజ్ పనులు, గృహనిర్మాణం, పింఛన్లపై సామాజిక తనిఖీ కార్యక్రమంపై ప్రజావేదిక జరుగుతుందని ఎంపీడీవో సౌభాగ్యమ్మ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీపథకంపై మండలంలోని 17 గ్రామాలలో 18వ రౌండ్ తనిఖీ నిర్వహించామన్నారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు జరిగిన పనులపై సామాజిక తనిఖీ చేసినట్లు తెలిపారు. ఈసామాజిక తనిఖీలో గుర్తించిన సమస్యలపై నేడు మండల ప్రజాపరిషత్ ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రజానిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

కేసీ కెనాల్ షెట్టర్లకు మరమ్మతులు

నంద్యాల రూరల్, ఆగస్టు 7: కేసీ కెనాల్ నీటి ప్రవాహంలో కీలక పాత్ర పోషించే షెట్టర్లకు మరమ్మతులు చేపట్టినట్లు కేసీ కెనాల్ నంద్యాల డీఈ సుబ్రమణేశ్వరరెడ్డి బుధవారం తెలిపారు. సంతజూటూర్ పికప్ ఆనకట్ట వద్ద 34, మద్దిలేరువాగు వద్ద 53, పోతులవాగు వద్ద 42 పాలింగ్ షెట్టర్లకు మరమ్మతులు చేశామని చెప్పారు. ఈ మరమ్మతుల వల్ల కేసీ కెనాల్ చివరి ఆయకట్టు భూములకు ఎలాంటి ఆటంకం లేకుండా సాగునీరు చేరుతుందన్నారు. కొన్నిరోజుల క్రితం కేసీ కెనాల్ తూములకు సైతం మరమ్మతులు చేశామన్నారు. కేసీ కెనాల్ ద్వారా నంద్యాల జిల్లా వ్యాప్తంగా 1,69,748 ఏకరాలకు సాగునీరు సరఫరా అవుతుందన్నారు.

హోం మంత్రిని కలిసిన తులసి రెడ్డి



హోంమంత్రి అనితతో చర్చిస్తున్న తులసి రెడ్డి

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 7: టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రముఖ న్యాయవాది తాతిరెడ్డి తులసి రెడ్డి రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనితను రామప్పపురంలోని ఆమె నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఇటీవల నంద్యాలలో జరిగిన సంఘటనలు, శాంతి భద్రతల విషయాలపై హోంమంత్రి ఆమె అడిగి తెలుసుకున్నారని తులసి రెడ్డి తెలిపారు. పలు విషయాలను మంత్రి దృష్టికి తులసి రెడ్డి తీసుకెళ్లారు. కొన్ని సమస్యల పరిస్కారాలపై ఆయన ఆమెతో చర్చించారు.

పగిడ్యాల తహసీల్దార్‌గా శివరాముడు

పగిడ్యాల, ఆగస్టు 7: పగిడ్యాల మండల తహసీల్దార్‌గా శివరాముడు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్యాపిలి మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ సాధారణ ఎన్నికల బదిలీలో భాగంగా చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఎన్నికల అనంతరం ప్రభుత్వం సొంత జిల్లాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయనను పగిడ్యాల మండల తహసీల్దార్‌గా నియమించారు. తహసీల్దార్‌కు డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు, ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనతరం పగిడ్యాల టీడీపీ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, వాసురెడ్డి, దామోదర్‌రెడ్డి, ఒగిల్లి శ్రీనివాసులు తదితరులు తహసీల్దార్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

జలాశయ స్పిల్ వే గేటు ఎత్తివేత



స్పిల్ వే గేటు ద్వారా విడుదలవుతున్న నీరు

వెలుగోడు, ఆగస్టు 7: వెలుగోడు జలాశయ స్పిల్ వేకు చెందిన ఓ గేటును తెలుగు గంగ అధికారులు ఎత్తి గాలేరు నదిలోకి 2 వేల క్యూసెక్కుల నీటిని బుధవారం విడుదల చేశారు. రెండు గేట్లు ఎత్తాల్సి ఉన్నప్పటికీ కుందూ నదిలో వర్షపు నీరు ప్రవహిస్తుండటంతో ఒక గేటును మాత్రమే ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయంలోకి బానక చెర్ల సముదాయం నుంచి 16500 క్యూసెక్కుల నీరు. వచ్చి చేరుతోంది.జలావయం స్పిల్ వే నుంచి 2వేల క్యూసెక్కులు, చెన్నై ప్రధాన కాలువకు 5 వేల క్యూసెక్కులు, వన్‌ఆర్ తూము ద్వారా 50, వన్‌ఎల్ తూము ద్వారా 30, నంద్యాల తాగునీటి పథకాలకు 15 క్యూసెక్కుల చొప్పున నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 262.02 మీట్ల వద్ద 12.636 టీఎంసీల నీరు నిలువ ఉంది. తెలుగుగంగ డీఈ వెంకటేశ్వర్లు ఏఈ మురళి, ఏఈఈ శివనాయక్ పాల్గొన్నారు.

వేలం పాట వాయిదా

నందికొట్కూరు రూరల్, ఆగస్టు 7: మండలంలోని మల్యాల గ్రామంలో ఆలయ భూముల కౌలు బహిరంగ వేలం పాట దేవదాయ శాఖ అధికారులు అర్ధాంతరంగా వాయిదా వేశారు. మల్యాల గ్రామంలో వెలసిన ఈశ్వరస్వామి, చెన్న కేశవస్వామి, రామాంజనేయ స్వామి ఆలయ భూములు దాదాపుగా 83 ఎకరాలు ఉంది. ఈ భూమిని బహిరంగ వేలం నిర్వహించడానికి గ్రామంలో ని గ్రామ పంచాయతీ కార్యాలయం, ఊరు వాకిలి వద్ద దేవదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండగా నందికొట్కూరు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమారెడ్డి, ఎస్ అశోక్ ఆధ్వర్యంలో 10 మంది పోలీసులతో గట్టి బందోబస్తు కూడా ఏర్పాటు చేశారు. ఒక సంవత్సరానికి వేలం పాట నిర్వహించాలని కొందరు, మూడేళ్ల కాలపరిమితితో వేలం పాట నిర్వహించాలని మరికొందరు డిమాండ్ చేయడంతో గొడవలు మెదలయ్యాయని అధికారులు తెలిపారు. అలాగే కొన్ని కారణాల వల్ల వేలం పాట వాయిదా వేస్తున్నట్లు దేవదాయశాఖ అధికారులు తెలిపారు.

ప్రజల కోసమే ప్రభుత్వం

● భూ కబ్జాలపై కమిటీ వేసి బాధితులకు అండగా ఉంటాం
● సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన అధికారులపై ఎమ్మెల్యే గౌరు చరిత ఆగ్రహం




గడివేములలో సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, టీడీపీ నాయకులతో సమావేశమైన గౌరు చరిత

గడివేముల, ఆగస్టు 7: ప్రజల సంక్షేమం, వారి అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ నాగమద్దమ్మ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖలో జరిగిన అభివృద్ధి పనులను పాలకులకు వివరించారు. కొర్రపోలూరు, సోమాపురంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని, కొర్రపోలూరు గ్రామంలో 600 ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైందని, భూ ఆక్రమణలపై విచారణ చేపట్టాలని కొర్రపోలూరు సర్పంచ్ మాలిక్‌బాషా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పాణ్యం నియోజకవర్గంలో ప్రభుత్వ, ప్రైవేటు, దేవదాయశాఖ, వక్ఫ్‌బోర్డు భూముల అన్యాక్రాంతంపై సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామన్నారు. వచ్చే సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శివరామిరెడ్డిని ఆదేశించారు. డిప్యూటీ తహసీల్దార్ గురునాథం, జడ్పీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు అనసూయమ్మ, రవణమ్మ, గంగాధర్‌రెడ్డి, మాలిక్‌బాషా, నాగేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీలు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆమె టీడీపీ నాయకులతో సమావేశమయ్యారు. టీడీపీ నాయకులు గ్రామంలోని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పార్టీలకతీతంగా ప్రభుత్వ పథకాలను అర్హులకు అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం మండల కేంద్రంలోని మూలపెద్దమ్మ ఆలయంలో ఎమ్మెల్యే గౌరుచరిత ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాసరెడ్డి, మాజీ కో-ఆప్షన్‌మెంబర్ రఫిక్, టీడీపీ సీనియర్ నాయకులు పంట రామచంద్రారెడ్డి, మురళమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

● ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఆశా వర్కర్ల యూనియన్ మండల అధ్యక్షురాలు నాగమణి ఎమ్మెల్యే గౌరుచరితకు బుధవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మండలంలోని ఆశాలు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి: ఎమ్మెల్యే



పారుమంచాలలో పశువైద్యశాల నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య, మాండ్ర శివానందరెడ్డి

జూపాడుబంగ్లా, ఆగస్టు 7: రైతు సంక్షేమమే ప్రభుత్వధ్యేయంగా పనిచేస్తోందని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. పారుమంచాలలో తమిళనాడు రాష్ట్రం చెన్నైకి చెందిన ఓదాత రూ.60 లక్షలతో నిర్మించిన పశువైద్యశాలను ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో ప్రభుత్వంతోపాటు, ఒక హోదాలో ఉన్న దాతలు కూడా సహకరిస్తే అభివృద్ధి జరుగుతుందని అన్నారు. సర్పంచ్ ప్రకాశం, టీడీపీ మండల కన్వీనర్ వెంకటేశ్వర్లుయాదవ్, టీడీపీ నాయకులు వెంకటరమణారెడ్డి, పిక్కిలి శ్రీనివాసులు, నారాయణరెడ్డి, శివరామిరెడ్డి, తూడిచర్ల సర్పంచ్ బాలమద్దిలేటి, రాముడు, దేవసహాయం, రవికుమార్ యాదవ్ పాల్గొన్నారు.

'రైతులకు సాంకేతిక పరిజ్ఞానం అందించాలి'

వెలుగోడు, ఆగస్టు 7: వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది రైతులకు సాంకేతిక పరిజ్ఞానం అందించి రైతులకు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలని ఏడీఏ ఆంజనేయ సూచించారు. బుధవారం వెలుగోడు పట్టణంలోని రైతు సేవా కేంద్రంలో వెలుగోడు కొత్తపల్లి ఆత్మకూరు, పాములపాడు మండల వ్యవసాయాధికారులకు, విస్తరణాధికారులకు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్తలు పలు అంశాలపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ఆర్ఎస్‌కే, కేవీకే సమన్వయంతో ఎప్పటికపుడు వ్యావసాయంలోని నూతన సంకేతికతలను రైతులకు అందించి వ్యవసాయ లాభసాటిగా మార్చాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో వరి, మొక్కజొన్న, సోయా చిక్కుడు పంటల్లో చేపట్టాల్సిన భూసార ఆధారిత ఎరువుల వినియోగం పోషక లోపాలపై చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై సిబ్బందికి అవగాహన కల్పించారు. వరి, శనగ, మినుములలో నూతన రకాలను సిబ్బందికి వివరించారు. ఆధునిక పరిజ్ఞానంతో సాగు ఖర్చును ఎలా తగ్గించాలో వారు వివరించారు. కార్యక్రమంలో ఏవో పవన్‌కుమార్, సీనియర్ శాస్త్రవేత్తలు రమణయ్య, సుధాకర్ బాలరాజు, వెలుగోడు కొత్తపల్లి ఆత్మకూరు, పాములపాడు మండల వ్యవసాయాధికారులు ఫణీశ్వరరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మహేష్, కేవీకే శాస్త్రవేత్త రవిగౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

'రాజకీయాలకు అతీతంగా పని చేయాలి'

గోస్పాడు, ఆగస్టు 7: గ్రామాల్లో అధికారులు రాజకీయాలకు అతీతంగా పనులు చేయాలని ఎంపీపీ ఆర్థర్ సైమన్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలోని వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు తమ శాఖల్లోని జరిగిన పనులను, జరగాల్సిన పనుల గురించి వివరించారు. వ్యవసాయశాఖ తరఫున ఏవో స్వప్నిక మాట్లాడుతూ మండలంలో దాదాపు 15 వేల ఎకరాల సాగు విస్తీర్ణం ఉందని, ఇప్పటికే 2500 ఎకరాల్లో వరి, 1300 ఎకరాల్లో మినుము, 160 ఎకరాల్లో మొక్కజొన్న, 170 ఎకరాల్లో సోయాబీన్స్ పంటలు వేశారని, వర్షపాతం కూడా బాగా నమోదు అయిందని, ఈ మూడు నెలల్లో తగినంత వర్షపాతం వచ్చిందని అన్నారు. త్వరలోనే ఈ- క్రాప్ బుకింగ్ చేస్తామన్నారు. వెలుగు ఏపీఎం రామశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో గ్రామైక్య సంఘాలు ప్రభుత్వ రూల్స్‌కు అనుగుణంగానే మార్పులు, చేర్పులు జరుగుతున్నాయని, ఎక్కడా కూడా రాజకీయ ఒత్తిళ్లు లేవని అన్నారు. ఏపీవో నాగజ్యోతి మాట్లాడుతూ ఉపాధి పథకంలో పని చేస్తున్న నలుగురు ఫీల్డ్ అసిస్టెంట్లు రాజీనామా చేశారని, మరో ఆరుగురిపై అంబుడ్స్‌మెన్ కమిటీ విచారణ పూర్తి చేసిందని, వివరాలు రావాల్సి ఉందని అన్నారు. సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను, ఇంటిని శుభ్రంగా ఉంచుకోవాలని గోస్పాడు పీహెచ్‌సీ డాక్టర్ గోపాల్ సూచించారు. ఎంపీడీవో నాగఅనసూయ, జడ్పీటీసీ జగదీశ్వరమ్మ, మండల ఉపాధ్యక్షులు జనార్దన్‌రెడ్డి, రాజు, సర్పంచ్‌లు కాటంరెడ్డి సుధామణి, ప్రమీళ, కోటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి: డీపీవో



చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో మంజులావాణి

నంద్యాల రూరల్, ఆగస్టు 7: మండలంలోని భీమవరం గ్రామాన్ని బుధవారం నంద్యాల జిల్లా పంచాయతీ అధికారి మంజులావాణి సందర్శించారు. చెత్త సేకరణ కేంద్రం, ప్రభుత్వ పాఠశాల, సబ్ సెంటర్లను పరిశీలించారు. రోడ్ల పక్కన ఉన్న చెత్త కుప్పలను తొలగించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.

ఆత్మకూరులో 37.4 మి.మీ. వర్షపాతం

ఆత్మకూరు, ఆగస్టు 7: నైరుతీ రుతుపవనాల రాకతో ఆత్మకూరు ప్రాంతంలో మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం నుంచి బుధవారం వరకు 24గంటల వ్యవధిలో 37.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. బుధవారం కూడా అడపాదడపా వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని ఏకలవ్యానగర్, ఇందిరానగర్, సాయిబాబానగర్, లక్ష్మీనగర్, గరీబ్‌నగర్, హుసేన్‌సానగర్, రహమత్‌నగర్ తదితర ఏరియాల్లోని లోతట్టు కాలనీల్లో వర్షపునీరు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కప్పలకుంట, అప్పారావువీధి, పోస్టాఫీసు ఏరియా, కేజీరోడ్డు తదితర ప్రధాన రహదారుల్లో వర్షపునీరు నిలిచిపోవడంతో జనం అసౌకర్యానికి గురయ్యారు. ఆత్మకూరు శివార్లలోని పడేవాగు, భవనాశి నదిలో నీటి ప్రవాహం కొనసాగింది. అదేవిధంగా మండలంలోని పలు చెరువుల్లో కూడా నీటినిల్వలు పెరిగాయి. కాగా నల్లమల అడవిలో కూడా అధిక వర్షాలు కురియడంతో జలపాతాలు కనువిందు చేస్తున్నాయి.

నేడు ఎస్‌ఎంసీ ఎన్నికలు

పగిడ్యాల, ఆగస్టు 7: మండలంలో గురువారం ఎస్ఎంసీ కమిటీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎంఈవో సుభాన్ తెలిపారు. 4 జడ్పీ ఉన్నత పాఠశాలు, కేజీబీవీ, ఆదర్శ పాఠశాల, గురుకుల పాఠశాలతో పాటు 19 ఎంపీపీ, రెండు ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కొత్తపల్లి: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం జరిగే పాఠశాలల యజమాన్య కమిటీల ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల ఇన్‌చార్జి ఎంఈవో బ్రహ్మం నాయక్, ఎంఈవో-2 ఇనయతుల్లా తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ మండలంలోని 42 ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

'సమస్యల పరిష్కారానికి కృషి'



నంద్యాలలో పర్యటిస్తున్న ఎన్ఎండీ ఫిరోజ్

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 7: గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో నియోజకవర్గంలో ఎక్కడ ఇసమస్యలు అక్కడే ఉన్నాయని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. నంద్యాలలోని 38 వార్డు వైఎస్ఆర్ నగర్‌లో బుధవారం ఆయన పర్యటించారు. వార్డులోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఖాళీ ప్రదేశాలలో చెత్తా చెదారం పోవడంతో ప్రజలు రోగాల పడుతున్నారని అన్నారు. పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను అధికారులను కోరారు.బ మౌలిక వసతుల కల్పనకు మంత్రి ఫరూక్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ కౌన్సిలర్లు నాగార్జున, జయనాబి, నాయకులు దేరెడ్డి శివనాగిరెడ్డి, తాటికొండ బుగ్గరాముడు, ప్రసాద రెడ్డి,అనిల్‌కుమార్ సింగ్ తదిరతులు పాల్గొన్నారు.

సాక్షి గణపతికి విశేష అభిషేకం

శ్రీశైలం, ఆగస్టు 7: శ్రీశైలం మహాక్షేత్రంలో లోకల్యాణం కోసం బుధవారం ఉదయం సాక్షి గణపతి స్వామికి విశేష అభిషేకం, పూజలు నిర్వహించారు. అభిషేకాన్ని పంచామృతాలతోనూ, పలు ఫలోదకాలతోనూ, హరిద్రోదకం, కలశోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధజలాలతో అభిషేకాన్ని జరిపి మహా మంగళ హారతులు ఇచ్చారు.

జ్వాలా వీరభద్రస్వామికి..

శ్రీశైలం క్షేత్రంలో లోకకళ్యాణంకోసం మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలో ఉత్తరభాగంలో ఉన్నటువంటి జ్వాలావీరభద్ర స్వామికి ప్రదోషకాలంలో విశేష అభిషేకం, పూజలు నిర్వహించింది. స్వామికి పంచామృతాలతోనూ, బిల్వోదకం, కుంకుమోదకం, హరిద్రోదకం, భస్మోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధజలాలతో అభిషేకం నిర్వహించారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు



నృత్యం చేస్తున్న కళాకారులు

శ్రీశైలం, ఆగస్టు 7: శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో బుధవారం హైదరాబాద్‌కు చెందిన పంచమవేద నాట్య నిలయం బృందంతో సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మహాగణపతిం, శివపంచాక్షరి, నమఃశివాయతే, కాలభైరవాష్టకం, ఓం నమఃశివాయా తదితర గీతాలకు కళాకారులు చేసిన నృత్య ప్రదర్శనలు అలరించాయి.

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

పాణ్యం, ఆగస్టు 7: పాణ్యం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శివారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మట్లాడుతూ 2024-25 సంవత్సరానికి డిగ్రీ విద్యార్థులకు తెలుగు, కామర్స్ సబ్జెక్టులు బోధించుటకు అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత సబ్జెక్టులలో పీజీలో 55 శాతంపైగా ఉత్తీర్ణత ఉండాలన్నారు. ఏపీ సెట్, నెట్, పీహెచ్‌డీ కలిగిన వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 12 వతేదీన ఉదయం 10 గంటలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో పాటు డెమో క్లాసుకు హాజరు కావాలన్నారు.

'విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి'



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 7: రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పవన్, రాంబాబు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కార్యాలయం నుంచి భారీ ర్యాలి చేపట్టి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. జీవో నెంబరు 117ను రద్దు చేసి ప్రాథమిక పాఠశాలల పూర్వ వైభవానికి కూటమి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు మెస్, కాస్మెటిక్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. డీఆర్వో పద్మజకు వినతి పత్రం అందజేశారు. దస్తగిరి, వినయ్, మహేంద్ర వేణు, ఆరిఫ్, తదితరులు పాల్గొన్నారు.

'ఎన్నికలు ప్రశాంతంగా జరుపుకోవాలి'

పగిడ్యాల, ఆగస్టు 7: పాఠశాల యాజమాన్యం కమిటీ (ఎస్ఎమ్‌సీ) ఎన్నికల సందర్భంగా ఎలాంటి గొడవలు తలెత్తకుండా ప్రశాంతగా ఎన్నికలు జరుపుకోవాలని ఆత్మకూరు డీఎస్పీ రామంజినాయక్ సూచించారు. మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలోని సచివాలయం వద్ద బుధవారం ఇరు పార్టీలకు చెందిన వారితో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. గొడవలు, అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నందికొట్కూరు రూరల్ సీఐ కృష్ణయ్య, ఎస్ఐ గంగయ్య ఉన్నారు. అలాగే ప్రాతకోట, పగిడ్యాల గ్రామాల్లో ముచ్చుమర్రి ఎస్ఐ గంగయ్య ఆధ్వర్యంలో ఎన్నికలపై అవగాహన కల్పించారు.

కొత్తపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం నిర్వహించే స్కూల్ యాజమాన్య కమిటీ ఎన్నికలు ఆయా పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కొత్తపల్లి ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. బుధవారం ఎస్ఐ మాట్లాడుతూ ప్రధానంగా దుద్యాల, శివపురం, ముసలిమడుగు, కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాలలో జరిగే ఎన్నికల్లో గట్టి నిఘా ఉంచినట్లు ఎస్ఐ తెలిపారు.

'పంట నమోదు తప్పనిసరి'

జూపాడుబంగ్లా, ఆగస్టు 7: ఖరీఫ్‌లో సాగు చేసుకున్న పంటలను ఈ-పంట నమోదును తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయాధికారి కృష్ణారెడ్డి సూచించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఈ-క్రాప్ బుకింగ్‌పై వ్యవసాయ, రెవెన్యూశాఖలో ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్ఐ శ్రీరంగారెడ్డి, వీఆర్వోలు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రముఖ వైద్యుడి కన్నుమూత



వెంకటరమణ (ఫైల్)

ఆత్మకూరు, ఆగస్టు 7: ఆత్మకూరు ప్రాంతానికి చెందిన ప్రముఖ వైద్యుడు, సామాజిక వైద్య కేంద్రం సివిల్ సర్జన్ డాక్టర్ ఎస్.వెంకటరమణ(55) బుధవారం కన్నుమూశారు. గత కొంతకాలంగా ఆయన గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ హైద్రాబాద్‌లో చికిత్స పొందుతున్నారు. ఈక్రమంలోనే ఆయన గుండెకు బైపాస్ సర్జరీ కూడా జరిగింది. అయినప్పటికీ ఆయన కోలుకోలేక బుధవారం మృతిచెందారు. కాగా ఆయన గతంలో గోకవరం, బైర్లూటి, కొట్టాలచెరువు ప్రాథమిక వైద్యశాలల్లో పనిచేశారు. అదేవిధంగా ఆత్మకూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ కూడా బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఇదే ఆసుపత్రిలో సివిల్ సర్జన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. అంత్యక్రియలు గురువారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. డాక్టర్ వెంకటరమణకు భార్య లలితతో పాటు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆయన మృతదేహాన్ని బైర్లూటి పీహెచ్‌సీ వైద్యులు గోపాల్, ఇతర వైద్య సిబ్బంది, గిరిజన సంఘం నాయకులు నరసింహ నాయక్, మల్లికార్జున, నాగేంద్ర, నాగేషులు తదితరులు సందర్శించి నివాళి అర్పించారు.

'మండల్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలి'



బీపీ మండల్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

ఆత్మకూరు, ఆగస్టు 7: బీసీల అభ్యున్నతి కోసం మండల్ కమిషన్ సూచించిన సిఫారసులను అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్.రఘురాముడు యాదవ్, తాలుకా గౌరవాధ్యక్షులు రామకృష్ణ కోరారు. బుధవారం పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో మండల్ డేను పురస్కరించుకుని బీపీ మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బీసీల అభ్యున్నతి కోసం మండల్ కమిషన్ 40 సిఫారసులను అమలు చేయాలని సూచించినప్పటికీ పాలక ప్రభుత్వాలు ఇప్పటివరకు పట్టించుకోకపోవడం బాధాకరమని అన్నారు. సంఘం నాయకులు బాలస్వామియాదవ్, తిమ్మయ్య, రమణయాదవ్, శ్రీహరి, వెంకటేశ్వర్లు, పెద్దనాగన్న తదితరులు ఉన్నారు.

నంద్యాల (నూనెపల్లె): బీసీలకు బంగారు భవిష్యత్తును అందించిన మండల్ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని సమాజ్‌వాది పార్టీ రాయలసీమ జిల్లాల కోఆరిడనేటర్ పాండు రంగ యాదవ్ అన్నారు. మండల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సమాజ్‌వాద్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా అధ్యక్షుడు శివకృష్ణ యాదవ్, ఫరిదాబి, రాజేష్, మధు, బీసీ సెల్ అధ్యక్షుడు హనుమంత్ కుమార్ తదిరతులుపాల్గొన్నారు.

'చేనేత రంగానికి అండగా నిలవాలి'

ఆత్మకూరు, ఆగస్టు 7: చేనేత రంగానికి ప్రజలందరూ అండగా నిలవాలని ఆత్మకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జిష్ణు నాగవిజయ్ సూచించారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అధ్యాపకులు పద్మావతిబాయి, కృష్ణ, వెంకటసుబ్బయ్య, తిరుపతమ్మ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఉన్నారు.

ఆర్డీవో కార్యాలయ డీఏవోగా అంజనాదేవి

ఆత్మకూరు, ఆగస్టు 7: ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయ డివిజనల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ (డీఏవో)గా టి.అంజనాదేవిని నియమిస్తూ బుధవారం జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడ డీఏవోగా విధులు నిర్వహిస్తున్న సిరాజుద్దిన్ పదవీ విరమణ పొందారు. ఆ స్థానంలో అనంతపురం జిల్లాలో తహసీల్దార్‌గా విధులు టి.అంజనాదేవి ఇక్కడికి బదిలీపై వచ్చారు. కాగా అంజనాదేవి గతంలో ఆత్మకూరు తహసీల్దార్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తించారు.

మద్యం దుకాణాల్లో రిజర్వేషన్‌పై హర్షం

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 7: మద్యం దుకాణాల కేటాయింపుల్లో కొన్ని సమాజానికి వర్గాలకు రిజర్వేషన్ కల్పించాలన్న సీఎం చంద్రబాబు నిర్ణయంపై గౌడ్, ఈడిగ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు శేషాద్రి గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా శేషాద్రి గౌడ్ మాట్లాడుతూ.. కల్లుగీత కార్మికులను దృష్టిలో ఉంచుకుని వారి ఆర్థిక పురోభివృద్ధి కోసం మద్యం దుకాణా కేటాయింపుల్లో అవకాశం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. బీసీల సంక్షేమం కోసం టీడీపీ ముందు నుంచి పెద్ద పీట వేస్తోందని ఆయన అన్నారు. చిన్న బాలు, అప్పన్న, మోహన్,రామచంద్ర నారాయణ తదిరతులు పాల్గొన్నారు.

సిద్ధాపురం చెరువుపై జంగిల్ క్లియరెన్స్ పనులు



జంగిల్ క్లియరెన్స్ పనులు చేయిస్తున్న టీడీపీ నాయకులు

ఆత్మకూరురూరల్, ఆగస్టు 7: సిద్ధాపురం చెరువు వద్ద బుధవారం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఆదేశాల మేరకు టీడీపీ నాయకులు జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. ప్రస్తుతం వెలుగోడు జలాశయంలో జలాలు సమృద్ధిగా ఉన్న నేపథ్యంలో వెలుగోడు జలాశయం నుంచి ఎత్తి పోతల ద్వారా సిద్ధాపురం చెరువుకు సాగు నీరందించే దిశగా ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి తన సొంత నిధులతో ఈ పనులు చేపడుతున్నారు. రెండు పంప్‌హౌస్‌లకు విద్యుత్‌సరఫరా అందించేందుకు అండర్ గ్రౌండ్ కేబుల్ ద్వారా ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తెగిపోవడంతో వాటికి మరమ్మతులు చేపట్టేందుకు ఈ జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. టీడీపీ నాయకుడు రాజేంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యుత్ కేబుళ్ల మరమ్మతుల కోసం విస్తారంగా అక్కడ ఏర్పడిన పిచ్చిమొక్కలు, కంపచెట్లను తొలగించి జంగిల్ క్లియరెన్స్ పనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం: ఎస్టీయూ



మాట్లాడుతున్న శివశంకర్

చాగలమర్రి, ఆగస్టు 7: గత ప్రభుత్వంలో ప్రవేశ పెట్టిన బాత్రూమ్ల ఫొటోల యాప్‌కు టీడీపీ ప్రభుత్వం ఫుల్‌స్టాప్ పెట్టిందని, ప్రభుత్వ నిర్ణయం హర్షణీయమని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి శివశంకర్ అన్నారు. బుధవారం చాగ లమర్రి ఎస్టీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మా ట్లాడుతూ బాత్రూమ్ ఫొటోలు తీసి అప్‌లోడ్ చేసే యాప్‌ను పాఠశాల విద్యాశాఖ తొలగించిందని అన్నారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు మస్తాన్ బాషా, ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, ఆర్థిక కార్యదర్శి మాబు హుసేన్, జిల్లా ఉపాధ్యక్షుడు మహబూబ్‌బాషా, నారాయణరెడ్డి, సురే షప్ప, రాజశేఖర్‌రెడ్డి, ప్రసాదు, శేషాద్రి, నరసింహుడు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఆళ్లగడ్డ, ఆగస్టు 7: మండలంలోని ముత్తలూరు గ్రామానికి చెందిన ప్రహ్లద అనే వ్యక్తి 436 ప్యాకెట్ల ఈ బియ్యాన్ని తరలి స్తుండగా విజిలెన్స్ అధికారులు పట్టుకొని మంగళవారం రాత్రి ఆళ్లగడ్డ పట్టణ పోలీసు లకు అప్పగించారు. రేషన్ బియ్యాన్ని నుద్దపల్లెలోని డంప్ భవనానికి లారీలో తరలిస్తుండగా కర్నూలు విజిలెన్స్ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్‌ఐ నగీనా తెలిపారు.

కుమారుడి మృతిపై ఫిర్యాదు

రుద్రవరం, ఆగస్టు 7: మండలంలోని ముకుందాపురం గ్రామానికి చెందిన లక్ష్మీనరసయ్య (26) ట్రాక్టరు డ్రైవింగ్ చేస్తూండగా ప్రమాదవ శాత్తు గుంతలో పడడంతో మంగళవారం రాత్రి మృతి చెందిన విషయం విదితమే. బుధవారం మృతుడి తండ్రి భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఏఎస్‌ఐ భూపాల్‌రెడ్డి తెలిపారు. పొలం దున్ని గ్రామానికి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగిందని మృతుడి తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదే హాన్ని ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం చేయించి బంధువు లకు అప్పగించినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

పాఠశాల తనిఖీ

చాగలమర్రి, ఆగస్టు 7: చాగలమర్రి గ్రామంలోని రాఘవేంద్ర ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఎంఈవో అనూరాధ తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిం చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుదర్శన్‌రెడ్డి, మౌళాలి, సీఆర్పీ అమీర్ ఖాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

చాగలమర్రి, ఆగస్టు 7: ఉపాధి సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఏపీవో నిర్మల హెచ్చరించారు. బుధవారం ఉపాధి కార్యాలయంలో టీఏ, ఎఫ్ఏల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పండ్ల తోటల సాగుపై రైతులను ప్రోత్సహిం చాలన్నారు. 100 శాతం సబ్సిడీతో 16 రకాల పండ్ల మొక్కలను అంద జేస్తామని అన్నారు. కార్యక్రమంలో టీఏ, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

కాలం చెల్లిన మందులు విక్రయిస్తే చర్యలు

చాగలమర్రి, ఆగస్టు 7: ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో కాలం చెల్లిన మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏవో రంగనేతాజీ హెచ్చరించారు. బుధవారం చాగలమర్రి గ్రామంలోని లక్ష్మికిషోర్, జైకి సాన్ పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించా రు. ఎరువులు, పురుగు మందులు అధిక ధరలకు విక్రయిస్తే డీలర్లపై చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట ఏఈవోలు ఉన్నారు.


చాగలమర్రిలో మోస్తరు వర్షం



చాగలమర్రిలో రహదారిలో నిలిచిన వర్షపు నీరు

చాగలమర్రి, ఆగస్టు 7: మండలంలో బుధవారం తెల్లవారుజామున ఓ మోస్తరు వర్షం కురిసింది. ఈ వర్షంతో రహదారులు, ప్రభుత్వ కార్యా లయాలు జలమయమయ్యాయి. 27.7 మీ.మీ వర్షపాతం నమోదైంది. మొక్కజొన్న, కంది, పత్తి, వేరుశనగ తదితర పంటలకు వర్షం కుర వడం తో ప్రాణం పోసిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. కేసీ కాలువ, టీజీపీ కాలువలో నీరు ప్రవహిస్తుండటంతో వరి నారుమళ్లు వేసేందుకు రైతులు సిద్ధమయ్యారు.

డోన్(రూరల్): మండలంలో మంగళవారం రాత్రి నుంచి వర్షం కురిసింది. మండలంలో 10.4 సెం.మీల వర్షపాతం నమోదైనట్లు మండల వ్యవసాయాధికారి అబ్దుల్ షఫీ తెలిపారు. పంట పొలాల్లోకి వర్షం నీరు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన రైతులకు సూచించారు.



ఉయ్యాలవాడలో పీర్ల గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా జియారత్ వేడుక

ఉయ్యాలవాడ, ఆగస్టు 7: ఉయ్యాలవాడలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు జియారత్ వేడుకను ఘనంగా జరుపుకున్నారు. మౌలాలి, దస్తగిరి స్వాములను పూలమాలతో అలం కరించారు. తెల్లవారు జామున స్వామి వారిని చావిళ్లలో నుంచి బయటకు తెచ్చి మేళ, తాళాల మధ్య గ్రామోత్సవం చేశారు. ఇంటింటికీ వెళ్లి స్వామి వారు ప్రత్యేక పూజలందుకున్నారు. మధ్యాహ్నం స్వామి వారిని తిరిగి చావిళ్లలో కొలువుంచారు.

సంజామల: మండలంలలోని పేరుసోమల గ్రామంలో కొలువుదీరిన ఖాదర్‌వలి స్వామి పీర్లకు బుధవారం జియారత్ వేడుక నిర్వహించారు. టీడీపీ నాయకులు బెలుం సురేష్ రెడ్డి, శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో రాత్రి స్వామి వారి పీర్లను ఊరేగించారు.

రుద్రవరం: మండలంలోని కొండమాయపల్లె గ్రామంలో బుధవారం రంఖాసింస్వామి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామంలో ఇంటింటి వద్ద రంఖాసింస్వామికి ఫాతెహాలు చేశారు. గ్రామో త్సవం అనంతరం తిరిగి చావిడిలో స్వామిని కొలువుదీర్చారు.



కొండమాయపల్లెలో
రంఖాశీం స్వామి గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

రైతుల సాగులో అటవీ భూములు

బేతంచెర్ల, ఆగస్టు 7: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాల్సిన ప్రాంతాన్ని కొంత మంది రైతులు సుమారు వంద ఎకరాలకు పైగా సాగు చేసుకుంటున్నారు. ఇది తెలిసినా అటవీశాఖ అధికారులు చోద్యం చూడటం దీనికి నిదర్శనం. మండల పరిధిలోని సీతారామాపురం, ముద్దవరం గ్రామాల సరిహద్దుల్లో ఉన్న అటవీ ప్రాంతంలోని భూములను గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సీతారామాపురం గ్రామానికి చెందిన రైతులు ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్నారు. ఇది తెలిసినా అటవీ శాఖ అధికారులు తమకు మామూళ్లు ముట్టడంతో పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. గ్రామానికి చెందిన మధు 10 ఎకరాలు, చింతకాయల వెంకటేశ్వర్లు 12 ఎకరాలు, పిట్టల వెంకట్రాముడు, గడేకారి రాముడు 10ఎకరాలు, మద్దమ్మగారి రాజు 10 ఎకరాలు, మద్దమ్మగారి నాగేంద్ర 10 ఎకరాలు, కలుగోట్ల పుల్లయ్య 15 ఎకరాలు బోర్లు వేయించుకుని సాగు చేస్తున్నారు. అటవీ శాఖ ఉన్నతాధికారులు సీతారామాపురం గ్రామ పరిసరాల్లోని అటవీ పొలాలను సాగు చేసుకున్న వారిపై చర్యలు తీసకోవాలని గ్రామ రైతులు కోరుతున్నారు.



అటవీ భూముల్లో పంటలు వేసిన రైతులు

ఈ విషయమై ఫారెస్ట్ బీట్ అధికారిని రఘురాముడును వివరణ కోరగా.. గత కొన్నేళ్ల నుంచి సీతారామపురం గ్రామానికి చెందిన పలువురు అటవీ ప్రాంతంలో భూములు సాగు చేసుకోవడం వాస్తవమే అన్నారు.

రాయల పాలనను ఆదర్శంగా తీసుకోవాలి

ఆళ్లగడ్డ, ఆగస్టు 7: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకృష్ణదేవరాయల పాలనను ఆదర్శంగా తీసుకోవాలని ఆళ్లగడ్డ తాలుకా బలిజ సంఘం అధ్య క్షుడు నల్లగట్ల బాలుడు అన్నారు. శ్రీకృష్ణదేవరాయల పట్టాభిషేకం మహోత్స వాన్ని పురస్కరించుకొని ఆళ్లగడ్డ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఉన్న విగ్రహానికి బుధవారం పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్ర మంలో గౌరవాధ్యక్షుడు ప్రసాదు, కార్యదర్శి నరసింహులు, గుత్తి నరసింహు లు, ఆకుల వెంకటసుబ్బయ్య, రామదాసు, రామసుబ్బయ్య పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: స్థానిక బలిజ కాలనీలో బుధవారం శ్రీకృష్ణదేవరాయలు పట్టాభిషేక మహోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కాలనీలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బలిజ సంఘం గౌరవ అధ్యక్షుడు వెంకటస్వామి, అధ్యక్షుడు ఆకుల నడిపి వెంక ట సుబ్బయ్య, ట్రెజరర్ నరసింహుడు, సాగునీటి సంఘం మాజీ అధ్యక్షు డు చిన్న వెంకటసుబ్బయ్య, కొండయ్య, బాలసుబ్బయ్య పాల్గొన్నారు.



ఆళ్లగడ్డలో శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న బలిజ సంఘం నాయకులు

మంత్రి లోకేశ్‌ను కలిసిన సుబ్బారెడ్డి

డోన్, ఆగస్టు 7: రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను బుధవారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా టీడీపీ సీనియర్ నాయకులు గౌరు వెంకటరెడ్డితో కలిసి అమరావతిలోని సెక్రటేరి యట్‌లో మంత్రి నారా లోకేశ్‌ను కలిసి పలు అంశాలపై వినతి పత్రం అంద జేశారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో గాడి తప్పిన వ్యవస్థలను సరి చేసేందుకు సీఎం చంద్రబాబు తీసుకుంటున్న చర్యలు ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉన్నాయన్నారు.



లోకేశ్‌తో ధర్మవరం సుబ్బారెడ్డి

శ్రీశైలం రిజర్వాయర్ నిండటం శుభపరిణామం



శ్రీశైలం డ్యాం వద్ద బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, ఆగస్టు 7: జూలై మాసంలోనే శ్రీశైలం రిజర్వాయర్ పూర్తి స్థాయిలో నిండటం కూటమి ప్రభుత్వంలో ప్రజలకు శుభపరి ణామని మంత్రి బీసీ జనార్ధనరెడ్డి సోదరుడు బీసీ రాజారెడ్డి అ న్నారు. బుధవారం పలువురు టీడీపీ నాయకులతో కలిసి బీసీ రాజా రెడ్డి శ్రీశైలం రిజర్వా యర్‌ను పరిశీలించారు. ఎగువ రాష్ట్రాల్లో కురి సిన భారీ వర్షాల కారణంగా కృష్ణా, తుంగభద్ర వరద నీటితో శ్రీశైలంతోపాటు, ఉమ్మడి కర్నూలు జిల్లా, రాష్ట్రంలోని అనేక ప్రాజెక్టులు కళకళలాడుతున్నాయని అన్నారు.

కుష్టు వ్యాధిపై ఇంటింటా సర్వే నిర్వహించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్

ప్యాపిలి, ఆగస్టు 7: కుష్టు వ్యాధిపై ఇంటింటా సర్వే నిర్వహించాలని లెప్రసీ జాయింట్ డైరెక్టర్ దేవసాగర్ అన్నారు. బుధవా రం పట్టణంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జాయిం ట్ డైరెక్టర్ మాట్లాడుతూ కుష్టు వ్యాధి రహిత సమాజాన్ని నిర్మించాలన్నదే ప్రభుత్వ లక్ష్య మన్నారు. అనంతరం ఆయన పట్టణంలో తిరిగి కుష్టు వ్యాధి సర్వేలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైద్యులు తేజస్విని, మల్లికార్జున, విజ యకుమారి, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజలను అప్రమత్తం చేయండి

సంజామల, ఆగస్టు 7: రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని, మండల ప్రజలను అప్రమత్తం చేయాలని డిప్యూటీ తహసీల్దార్ అనిల్ కుమార్ వీఆర్వోలను ఆదేశించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోల సమావేశం జరిగింది. ఈ సం దర్భంగా డిప్యూటీ తహసీల్దార్ మాట్లాడుతూ భారీ వర్షాల కారణం గా మట్టిమిద్దెలు కూలే అవకాశాలు ఉన్నాయని, ఇటీవల జిల్లాలో ఒకే కుటుంబంలో మట్టిమిద్దె కూలి నలుగురు మృతి చెందారన్నారు ఇలాంటి సమస్యలు పునరావృతం కా కుండా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించారన్నారు. కార్యక్ర మంలో వి.ఆర్.ఒలు సుబ్బరాయుడు, ఎరుకలయ్య, గుర్రప్ప పాల్గొన్నారు.

పోస్టల్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

బేతంచెర్ల, ఆగస్టు 7: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పోస్టల్ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ ఇన్‌స్పెక్టర్ స్వామి నాయక్ సూచించారు. బుధవారం పట్టణంలోని సబ్ పోస్టాఫీసు కార్యాలయం నుంచి పాతబస్టాండు మీదుగా కొత్తబస్టాం డు వరకు బేతంచెర్ల సబ్ పోస్టుమాస్టర్ నరసింహులు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీపీఎంలు శ్రీనివా సులు, వెంకటేశ్వర్లు, రమేష్, శేఖర్ నాయక్, మధు, శివరామయ్య, రవికుమార్, తపాలశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రవీంద్రనాథ్ ఠాగూర్ రచనలు ఆదర్శం

కొలిమిగుండ్ల, ఆగస్టు 7: విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ రచనలు నేటి తరానికి ఎంతో ఆదర్శప్రాయమని తెలుగు పండిట్ వైవీఎస్ నారాయణరెడ్డి, కొలిమిగుండ్ల ఎస్సీ పాఠశాల హెచ్‌ఎం సుంకన్నలు అన్నారు. బుధవారం కొలిమిగుండ్ల, పేట్నీకోట, కనకాద్రిపల్లె గ్రామాల పాఠశాలల్లో రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయనకు నివాళులర్పించారు.

బనగానపల్లె: దేశం కోసం త్యాగాలు చేసిన మహనీయులను జాతి మరువరాదని జెకెఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందచారి అన్నారు. బుధవారం మండలంలోని పలుకూరు గ్రామంలో విశ్వకవి రవీం ద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు.

హామీని నేరవేర్చాలి

ఆళ్లగడ్డ, ఆగస్టు 7: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో విద్యార్థి సంఘాలకు ఇచ్చిన హామీని నేరవేర్చాలని విద్యార్థి సంఘం నాయకుడు లక్కు కార్తిక్ కోరారు. బుధవారం విద్యార్థి సంఘం నాయకులతో కలిసి ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియకు వినతి పత్రం ఇచ్చారు. జగన్ ప్రభుత్వం విద్యార్థులకు వ్యతిరేకంగా తెచ్చిన జీవో నెం బరు 77ను రద్దు చేసి ఫీజు రీయిబర్స్‌మెంటును ఇవ్వాలని కోరారు.

విలేజ్ హెల్త్ క్లీనిక్‌లకు పరికరాలు

కొలిమిగుండ్ల, ఆగస్టు 7 : మండలంలోని వివిధ గ్రామాల విలేజ్ హెల్త్ క్లీనిక్‌లకు ప్రభుత్వం పలు పరికరాలు మంజూరు చేసినట్లు మండల ప్రభుత్వ వైద్యులు డా.హరిచరణ్‌రెడ్డి బుధవారం తెలిపారు. కొలిమిగుండ్ల మండలంలో మొత్తం 11 విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు వున్నాయని అన్నారు. వీటికి ఎగ్జామినేషన్ టేబుళ్లు, హైలీ స్టాండ్స్, మందులు నిల్వ చేసే మిషన్లు తదితర పరికరాలు మంజూరయ్యాయన్నారు.

హెచ్.కొట్టాలలో పంట నమోదు

బేతంచెర్ల, ఆగస్టు 7: మండలంలోని హెచ్.కొట్టాల గ్రామంలో బుధవారం మండల వ్యవసాయాధికారి కిరణ్ కుమార్ ఆధ్వ ర్యంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు వేణు, అగ్రికల్చర్ అసిస్టెంట్ వేణు, ఏఈవో మధు లు రైతుల దగ్గర నుంచి పట్టాదారు పాసుపుస్తకాల నకలు, ఆధార్, బ్యాంకు ఖాతా నకలు రైతులు వేసిన పంట వివరాలను బుధవారం సేకరించారు.

ఘనంగా గోదాదేవి కల్యాణం



అహోబిలంలో కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

ఆళ్లగడ్డ, ఆగస్టు 7: దిగువ అహోబిలంలో గోదాదేవి, ప్రహ్లాద వరద స్వామివార్ల కల్యాణాన్ని వేదపండితులు బుధవారం ఘనంగా నిర్వహిం చారు. ముందుగా గోదాదేవి అమ్మవారికి పుబ్బనక్షత్రం పురస్కరించుకొని అభిషేకం చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను తిరువీధులలో ఊరే గించారు. అనంతరం కల్యాణోత్సవం చేపట్టారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం: పీడీ

దొర్నిపాడు, ఆగస్టు 7: పుట్టిన ప్రతి బిడ్డకు తల్లిపాలు అమృతమని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి తేజశ్వరి అన్నారు. బుధవారం మండలంలోని దొర్నిపాడు వెలుగు కార్యాలయ భవనంలో తల్లిపాల వారోత్సవాలు ఐసీ డీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ పుట్టిన ప్రతి బిడ్డకు గంట లోపు ముర్రు పాలు పట్టించాలని అన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ శకుంతలమ్మ, పీహెచ్‌ఎన్ భాగ్యమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ సాయికృప, ఏపీఎం బాబు, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: తల్లిపాలతో చంటి బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి అపర్ణ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాల యంలో ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మతో కలిసి ఆయా గ్రామాల అంగన్‌వాడీ వర్కర్ల, చంటి బిడ్డల తల్లుతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఎంపీ డీవో కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్ర మంలో ఎంపీడీవో రఘురామ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దీప్తి, ఎంపీహె చ్‌ఈవో దస్తగిరి పాల్గొన్నారు.

రుద్రవరం: తల్లిపాలు బిడ్డకు అమృతమని అంగన్వాడీ కార్యకర్తలు రాజ్య లక్ష్మి, బీబీలు అన్నారు. బుధవారం డి.కొట్టాల, చిలకలూరుగ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లిపాలు తాగిస్తే బిడ్డకు వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందన్నారు.



మహిళలకు సూచనలిస్తున్న ఐసీడీఎస్ పీడీ తేజేశ్వరి

చాగలమర్రి: తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠమని ఆరోగ్య విస్తరణాధికారి వెంక టేశ్వర్లు అన్నారు. బుధవారం డి.వనిపెంట గ్రామంలో తల్లిపాల వారోత్స వాలను నిర్వహించారు. తల్లిపాల ఆవశ్యకత గురించి తెలియజేశారు. కార్యక్ర మంలో సీహెచ్‌వో కృష్ణమ్మ, ఏఎన్ఎం సంధ్య, ఆశాలు రాజేశ్వరి, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

సీఐని కలిసిన నాయకులు



సీఐ రమేష్‌బాబుకు అభినందనలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

కొలిమిగుండ్ల, ఆగస్టు 7: కొలిమిగుండ్ల నూతన సీఐగా బాధ్యతలు స్వీక రించిన మద్దినేని రమేష్‌బాబును టీడీపీ , కుల సంఘాల, ప్రజా సంఘాల నాయకులు బుధవారం కలిసి అభినందనలు తెలిపారు. బెలుంశింగవరం టీడీపీ నాయకులు డి.శంకరరెడ్డి, కట్టుబడి రామ్మోహన్, వెంకటేశ్వరరెడ్డి, విశ్వనాథ్‌లు సీఐని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మార్పీస్ జిల్లా నాయ కుడు గోపాల్‌గారి దస్తగిరి ఆధ్వర్యంలో పక్కీరా, దస్తగిరి, ఏపీ ఎమ్మార్పీస్ మండల అధ్యక్షుడు క్రిష్ణయ్య మాదిగ, బాల కంబయ్య, రామాంజనేయులు సీఐ రమేష్‌బాబును కలిశారు.

బేతంచెర్ల సీఐని కలిసిన బీఎంఎస్ సభ్యులు

బేతంచెర్ల: పట్టణంలోని ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ కమిటీ సభ్యులు బేతంచెర్ల పోలీస్‌స్టేషన్‌కు నూతన సీఐగా బాధ్య తలు చేపట్టిన వెంకటేశ్వరరావును బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువ కప్పి, పూలబొకే అందజేసి సన్మానించారు. ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు సికింధర్, ఉపాధ్యక్షుడు షేక్షా, ప్రధాన కార్యదర్శి సద్దాం, సహాయ ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ సలాం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు బిల్లులు వేగవంతం చేయండి

సంజామల, ఆగస్టు 7: ప్రభుత్వ పక్కా గృహాలు నిర్మించుకున్న లబ్ధిదా రులకు ఎన్.ఆర్.ఈ.జి.ఎస్, ఉపాధిహామి పథకం ద్వారా అందించాల్సిన బిల్లులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ విజయ్ కుమార్ రెడ్డి ఎన్.ఆర్. ఈ.జి.ఎస్ హౌసింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్ ఎ.ఈ బాలచంద్రుడు, ఎన్.ఆర్.ఈ.జి.ఎస్ ఎపిఒ సూర్యప్రకాష్ , టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. పక్కా గృహాలు నిర్మించుకున్న లబ్ధిదారులకు అందించాల్సిన రూ. 27,000కు లబ్ధిదారుడి కుటుంబానికి 90రోజులు పనులు కల్పించి పూర్తి చేయించాలన్నారు.

నేడు స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీల ఎన్నిక

కోవెలకుంట్ల, ఆగస్టు 7: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం స్కూలు మేనేజ్‌మెంటు కమిటీ ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవోలు వెంకటరామిరెడ్డి, వెంకటసుబ్బయ్య తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మండలంలో మొత్తం 36 ప్రా థమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఎన్నికలు జరుగుతాయన్నారు.

కొలిమిగుండ్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో గల 59 ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ఎస్ఎంసీ(స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) ఎన్నిక లకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు మండల విద్యాధికారి అబ్దుల్‌కలాం బుధవారం వెల్లడించారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎన్నికల నిర్వహణకు లేఖ అందజేసినట్లు ఆయన తెలిపారు.

వెదుర్ల ఆటో పట్టివేత ?

రుద్రవరం, ఆగస్టు 7: రుద్రవరం అటవీ రేంజ్ పరిధిలో వెదుర్లు నరికి అక్రమంగా తరలిస్తుండగా డిప్యూటీ డైరెక్టర్ అనురాగ్‌మీనా బుధవారం దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. అహోబిళం నుంచి ఆటోలో వెదుర్లు, గంప బుట్టలు తరలిస్తుండగా ఆర్‌క్రిష్ణాపురం, కందుకూరు గ్రామాల మధ్య పట్టుబడింది. పట్టుబడిన ఆటోను ఆట వీ కార్యాలయానికి తరలించినట్లు సమాచారం.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

ప్యాపిలి, ఆగస్టు 7: మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం ప్రభుత్వ జూని యర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కా ర్యక్రమాన్ని చేపట్టారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు నవీన్‌పాటి, రామ క్రిష్ణయ్య, సత్యబాబు, వెంకటరమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీతోనే మత్స్యకారుల సంక్షేమం

శిరివెళ్ల, ఆగస్టు 7: మత్స్యకారుల సంక్షేమం టీడీపీ ప్రభుత్వంతోనే సాధ్యమని మాజీ ఎంపీటీసీ, మతస్యకార సంఘం ప్రతినిధి కొండబో యిన బాలచంద్రుడు అన్నారు. గత వైసీపీ హయాంలో మత్స్యకారులకు శరాఘా తంగా మారిన 144, 217 జీవోలను టీడీపీ ప్రభుత్వం రద్దు చేస్తూ కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవడంతో మత్స్యకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. చెరువుల్లో చేపల వేటను సాగిస్తున్న మత్స్యకా రులపై గత వైసీపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు చేపట్టిందన్నారు. ఎన్నికల సమయంలో మత్స్యకారులకు న్యాయం చేస్తామని ఇచ్చిన హామీ ని సీఎం చంద్రబాబు నిలబెట్టుకున్నారని, దీంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని దాదాపు రెండు లక్షల మంది మత్స్యకారులకు మేలు జరుగుతుందన్నారు.

చెత్త సంపద కేంద్రాలపై దృష్టి సారించండి

కోవెలకుంట్ల, ఆగస్టు 7: చెత్తసంపద కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారిం చాలని ఈవోపీఆర్‌డీ రాధికారెడ్డి పంచాయతీ కార్యదర్శులు సూచించారు. బుధవారం ఆమె కోవెలకుంట్ల పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కోవెలకుంట్ల మేజరు గ్రామ పంచాయతీతో పాటు గుల్లదుర్తి, భీమునిపాడు, కంపమల్ల, జొలదరాశి, కలుగొట్ల, రేవ నూరు, లింగాల, వల్లంపాడు, పెద్దకొప్పెర్ల, బిజినవేముల, అమ్మడాల, గుంజలపాడు గ్రామ పంచాయతీల్లో చెత్త సంపద కేంద్రాలు ఉన్నాయన్నారు. వెలగటూరు, పొట్టిపాడు గ్రామాల్లో నిర్మాణ దశలో ం ఉన్నాయన్నారు. చిన్న కొప్పెర్ల గ్రామంలో స్థలం లేకపోవడంతో చెత్తసంపద కేంద్రం నేటికీ నోచు కోలేదని ఆమె తెలిపారు. ఈ గ్రామ పంచాయతీలో కూడా అధికారులతో మాట్లాడి చెత్తసంపద కేంద్రాలు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు.

స్వదేశీ పరిశ్రమను ప్రోత్సహించండి



సంప్రదాయ దుస్తులతో అధ్యాపకులు, విద్యార్థులు

కోవెలకుంట్ల, ఆగస్టు 7: స్వదేశీ పరిశ్రమను ప్రతి ఒక్కరూ ప్రోత్సహిం చాలని శ్రీవాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె. వేణుగోపాల్ అన్నారు. బుధవారం పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహిం చారు. ఈసందర్భంగా సాంప్రదాయ దుస్తులు ధరించి అధ్యాపకులు, విద్యా ర్థులు దర్శనమిచ్చారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

బేతంచెర్ల, ఆగస్టు 7: మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామా నికి చెందిన సయ్యద్ మహ్మద్ గౌస్ అనే వ్యక్తిని తల్లి, కొడుకులు కొట్టి గాయ పరిచారని కేసు నమోదైనట్లు హెడ్ కానిస్టేబుల్ ఎంవీ రమణ బుధవారం రాత్రి తెలిపారు. గ్రామానికి చెందిన సయ్యద్ మహ్మద్ గౌస్ అదే గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లుకు చిప్స్ ఫ్యాక్టరీని రూ.2లక్షలు అడ్వాన్స్ ఇచ్చి లీజుకు తీసుకుని ఫ్యాక్టరీ నడుపుకుంటూ ఉండేవాడని ఆయన తెలిపారు. ఫ్యాక్టరీ మరమ్మతులకు గానూ డబ్బులు కూడా ఖర్చు చేసినట్లు ఆయన తెలిపారు. వెంకటేశ్వర్లు భార్య వెంకటేశ్వరమ్మ ఫ్యాక్టరీకి ఇచ్చిన లీజు డబ్బులు రూ.2 లక్షలు మరమ్మతులకు ఖర్చు చేసిన డబ్బులు ఇవ్వాలని అడుగగా వెంక టేశ్వరమ్మ, ఆమె కుమారుడు శివరంజన్ తల్లి కుమారుడు సయ్యద్ మహ్మ ద్‌గౌస్‌ను కొట్టి గాయపరిచారని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ఎంవీ రమణ తెలిపారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తా

రుద్రవరం, ఆగస్టు 7: ప్రజలకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తామని నూతన తహసీల్దారు మల్లికార్జున అన్నారు. బుధవారం తహసీల్దార్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ ఆర్ఐగా డిప్యూటీ తహసీ ల్దారుగా పనిచేసిన అనుభవం ఉందన్నారు. ఎప్పటికప్పుడు రెవెన్యూ గ్రా మాల పరిధిలో సమస్యల తెలుసుకుని పరిష్కరిస్తామన్నారు. రెవెన్యూ సిబ్బ ంది పూలమాలలతో తహసీల్దారును సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు రవీంద్రప్రసాద్ మహబూబ్‌బాషా, వీఆర్వోలు పాల్గొన్నారు.